# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 22-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 278 పేజీలు 8 వెల: రూ.1/-


## మాజీ సీఎం బాబూలాల్ గౌర్ మృతి

భోపాల్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ గౌర్ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాబూలాల్ భోపాల్ లోని ఓ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆయన వయసు 89 సంవత్సరాలు. 2004 ఆగస్ట్ 23 నుంచి 2005 నవంబర్ 29వరకు బాబూలాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన మృతికి ప్రధాని మోడీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంతాపం తెలిపారు. జన్‌సంఘ్‌ల నుంచి బాబూలాల్ గౌర్ రాజకీయాల్లోకి వచ్చారు. ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో అరెస్ట్ అయి జైలుకెళ్లారు. 2003లో మధ్యప్రదేశ్ లో ఉమాభారతి ప్రభుత్వం ఏర్పడ్డాక? ఆమె కేబినెట్ లో పట్టణాభివృద్ధి, న్యాయ శాఖ, హౌసింగ్, పర్యావరణం, కార్మిక శాఖలు నిర్వహించారు. సీఎం పదవికి ఉమాభారతి రాజీనామా తర్వాత ముఖ్యమంత్రి అయిన బాబూలాల్ గౌర్ ఏడాది పాటు సీఎం పదవిలో కొనసాగారు. మొత్తంగా ఏడాది 98 రోజుల పాటు సీఎంగా పనిచేశారు. తర్వాత శివరాజ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన కేబినెట్ లో అనేక శాఖలకు మంత్రిగా పనిచేశారు.

# అడవుల రక్షణకు కఠిన చర్యలు

### కబ్జాలపై ఉక్కుపాదం మోపాల్సిందే
### కలెక్టర్లు, మంత్రులకు సిఎం కెసిఆర్ స్పష్టీకరణ
### సింగరాయిపల్లి సామాజిక ఫారెస్ట్ తనిఖీ

హైదరాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): అడవుల కబ్జాపై ఉక్కుపాదం మోపాలని మంత్రులు, అధికారులకు సిఎం కెసిఆర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్లతో సమావేశాల్లో భాగంగా బుధవారం రెండోరోజు ఉదయం హైదరాబాద్ సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి మంత్రులు, అధికారులు, కలెక్టర్లతో కలిసి గజ్వేల్ లోని కోమటిబండకు వెళ్లారు. మార్గమధ్యలో.. సింగాయిపల్లి ఫారెస్ట్ బ్లాక్‌లో



గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో సింగరాయపల్లిలో అటవీపునరుద్దరణ పథకం కింద పెరిగిన అడవిని కలెక్టర్లు, అధికారులతో కలసి పరిశీలించిన సిఎం కెసిఆర్

ఆగారు. అక్కడ అడవుల పరిరక్షణ ఆక్రమణలపై అధికారులతో సీఎం కేసీఆర్ మాట్లాడారు. ఆక్రమణలు అడ్డుకునేందుకు చర్యలు ఏం తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అందుకు వన సంరక్షణపై ప్రచారం , అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని అధికారులు, మంత్రులు వివరణ ఇచ్చారు. ఐతే దీనిపై సీఎం కేసీఆర్ ఒకింత సీరియస్ గా స్పందించారు. ఇది నా నియోజకవర్గం. ఇక్కడేం జరుగుతుందో చూస్తూనే ఉన్నా. 15రోజులకు ఒకసారి వస్తూ పోతూ చూస్తునే ఉన్నా. ఇక్కడేం జరుగుతుందో నాకూ తెలుసు. అడవులు, అటవీ భూములు కబ్జా కాకుండా చూడటం, వాటి సరిహద్దులు గుర్తించడం చాలా ముఖ్యం. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూడా ఈ పని చేయాలని కేసీఆర్ చెప్పారు. హరితహారంలో భాగంగా చేపట్టిన మొక్కల పెంపకం, వాటి ఫలితాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మంత్రులు, అధికారుల బృందం సిద్దిపేట జిల్లాకు బయల్దేరింది. సీఎం సహా మంత్రులు, కలెక్టర్లు హైదరాబాద్ ప్రగతి భవన్ నుంచి బస్సుల్లో బయల్దేరి వర్గల్ మండలం సింగాయిపల్లికి చేరుకున్నారు. ఈ ప్రాంతంలో 2016-17లో చేపట్టిన అటవీ పునరుజ్జీవన పనులను పరిశీలించారు. గజ్వేల్, కోమటిబండ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన సామాజిక వనాలను పరిశీలించారు. అలాగే కోమటిబండ గుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ పంపుహౌస్‌ను సందర్శించారు. కోటి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మాణమైన ఈ భారీ పంప్ హౌస్ నుంచి 456 గ్రామాలకు ప్రతిరోజూ తాగునీరు సరఫరా జరుగుతోంది. 5 ఎకరాల్లో నిర్మించిన భగీరథ కేంద్రాన్ని మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. పథకం పనితీరును వివరించనున్నారు. సీఎం రాక సందర్భంగా కోమటిబండలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పంప్ హౌస్ వరకు ప్రత్యేక రోడ్డు నిర్మించారు. పంప్ హౌస్ దగ్గర కొత్తగా నిర్మించిన మిషన్ భగీరథ నాలెడ్జ్ సెంటర్ ను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కోమటిబండ ప్రాంతంలో పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# భద్రాద్రి జిల్లాలో ఎన్‌కౌంటర్

## మావోయిస్టు మృతి

### - ముమ్మర గాలింపు చేపట్టిన పోలీసులు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు21 (ఆర్ఎన్ఎ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం ఉదయం పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందగా, మిగతావారు ఘటనాస్థం నుంచి తప్పించుకున్నారు. కొత్తగూడెం జిల్లాలోని మణగూరు మండలం బుడుగుల అటవీప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జిల్లాలోని బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. బడుగుల అటవీప్రాంతానికి రాగానే పోలీసులను గమనించిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. వెంటనే అలర్టయిన పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో గుంటూరు రవి అనే మావోయిస్టు చనిపోగా.. మిగిలినవారు కాల్పులు జరుపుతూ అడవుల్లోకి పారిపోయారు. ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. పార్టీ విస్తరణ కోసం మావోలు గ్రామాల్లో తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపును ముమ్మరం చేశామన్నారు

# ఉత్తరాఖండ్‌లో దుర్ఘటన సహాయక హెలికాప్టర్ కూలి

## ముగ్గురు మృతి



డెహ్రాడూన్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): వరద సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వరద ప్రభావిత ప్రాంతాలకు నిత్యవసర వస్తువులు తరలిస్తున్న హెలికాప్టర్.. పవర్ కేబుల్‌ను ఢీకొట్టింది. దీంతో ఆ చాపర్ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో పైలట్ కప్తాల్ లాల్, కోపైలట్ శైలేష్ తో పాటు స్థానిక నివాసి రాజ్ పాల్ మృతి చెందారు. ఉత్తరకాశీలోని మోరీ నుంచి మోల్డీకి బయల్దేరిన కాసేపటికే ఈ ప్రమాదం జరిగింది. ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకు 35 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఉత్తరకాశీలోని టోన్స్ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్.. ఉత్తరకాశీలోని వరద ప్రభావిత ప్రాంతాలను నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయకచర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే.. ఉత్తరకాశీని వరుణుడు వణికిస్తున్నాడు. భారీ వర్షాలతో గ్రామాలు అతలాకుతల మయ్యాయి. గత వారం కురిసిన వర్షాలకు 16 మంది చనిపోయారని జిల్లా అధికారులు తెలిపారు. వర్షాల ధాటికి 70 ఇళ్లు కూలిపోగా.. 115 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నాలుగు వంతెనలు ధ్వంసమయ్యాయి. 14కిమీ.ల మేర విద్యుత్ స్తంభాలు నేలకూలిపోయాయని అధికారులు చెప్పారు.

# చిదంబరానికి లుక్‌ఔట్ నోటీసులు..

### - అజ్ఞాతంలోకి వెళ్లిన చిదంబరం..
### - సీబీఐ, ఈడీ అధికారుల వెతుకులాట

న్యూఢిల్లీ, ఆగస్టు21(ఆర్ఎన్ఎ) : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి. చిదంబరం మెడకు ఉచ్చు బిగుస్తోంది. ఎన్‌ఫోర్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు.. చిదంబరానికి లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులతో చిదంబరం విదేశాలకు వెళ్లకుండా ఈడీ చర్యలు తీసుకుంది. చిదంబరానికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో.. ఆయన కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలని సీబీఐ, ఈడీ అధికారులు ఎదురుచూస్తున్నారు. అయితే చిదంబరం అజ్ఞాతంలోనే ఉండిపోయారు. ఇక మరోవైపు బుధవారం ఉదయం చిదంబరం నివాసానికి సీబీఐ అధికారులు వెళ్లి వచ్చినప్పటికీ ఆయన ఆచూకీ తెలియలేదు. చిదంబరం తరపు న్యాయవాదులు.. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. చిదంబరం పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ రమణ ధర్మాసనం ముందు న్యాయవాది కపిల్ సిబాల్ ప్రస్తావించారు. చిదంబరం పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనానికి ఎన్వీ రమణ ధర్మాసనం పంపింది. కపిల్ సిబాల్ వాదనల తర్వాత సీజేఐ ధర్మాసనానికి ఎన్వీ రమణ పంపారు. వాదనలను సీజేఐ ముందు వినిపించాలని జస్టిస్ ఎన్వీ రమణ ధర్మాసనం సూచించింది.

మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సీజేఐ ముందు ప్రస్తావనకు రానుంది చిదంబరం పిటిషన్.

బీజేపీ అధికారాన్ని దుర్వినియోగం :రాహుల్ గాంధీ చిదంబరం కోసం సీబీఐ అధికారులు గాలింపును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. చిదంబరం వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు మోదీ ప్రభుత్వం సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. ఇందు కోసం వెన్నెముకలేని మీడియాను వాడుకుంటోందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ తరహాలో అధికారాన్ని దుర్వినియోగం చేయడాన్ని తాను ఖండిస్తున్నట్లు చెప్పారు.

## సిట్ బృందంలోని పోలీసులపై దుండగుల కాల్పులు

# ఇద్దరు మృతి,

### మరొకరికి గాయాలు

పాట్నా,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): బీహార్‌లోని సరన్ జిల్లాలో దారుణం జరిగింది. ప్రత్యేక దర్యాప్తు సంస్థకు చెందిన ఇద్దరు పోలీసులను గుర్తు తెలియని దుండగులు కాల్చిచంపారు. దుండగుల దాడిలో మరో పోలీసు తీవ్రంగా గాయపడ్డారు. అయితే చప్రాలోని మార్కెట్ ఏరియాలో క్రిమినల్స్‌పై దాడి చేసి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వద్ద ఉన్న ఏకే-47, రెండు తుపాకులను క్రిమినల్స్ దొంగిలించారు.

పోలీసులు హత్యకు గురైన ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు. మృతులను సబ్ ఇన్‌స్పెక్టర్ మిథిలేష్ కుమార్ షా, కానిస్టేబుల్ మహ్మద్ అఫ్రోజ్‌గా గుర్తించారు. గాయపడిన కానిస్టేబుల్‌ను హవల్దార్ రాజ్‌నీష్‌గా గుర్తించారు. రాజ్‌నీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని పాట్నా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు.

## ఎల్ఎల్ఎం పరీక్ష రాసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

వరంగల్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): ఆర్మూర్ శాసనసభ్యుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి వరంగల్ లోని కాకతీయ యూనివర్శిటీలో ఎల్ఎల్ఎం చివరి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్ష రాశారు. హన్మకొండలోని ఆదర్శ లా కళాశాలలో ఎల్ఎల్ఎం కోర్సులో చేరి దూర విద్యను అభ్యసిస్తున్నారు. ఎల్ఎల్ఎం దూర విద్యను అభ్యసిస్తున్న జీవన్‌రెడ్డి ఇవాళ ఉదయమే వరంగల్ పట్టణానికి చేరుకున్నారు. కళాశాలలో జరిగిన గ్రూప్ డిస్కషన్లో పాల్గొని పరీక్షకు హాజరయ్యారు. ఇప్పటి వరకు రాసిన అన్ని సెమిస్టర్లలో ఎమ్మెల్యే ఉత్తీర్ణుడయ్యారు. ఎల్ఎల్ఎం పూర్తి చేసిన అనంతరం పీహెచ్‌డీ కూడా చేస్తానని, దాంతో న్యాయవిద్యలో పరిజ్ఞానం పెరుగుతుందని జీవన్‌రెడ్డి వివరించారు.

## లోయలో పడ్డ ఐఏఎఫ్ జవాన్ల ట్రక్కు..

## ముగ్గురు మృతి

బార్మర్, ఆగస్టు 21: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) జవాన్లు ప్రయాణిస్తున్న ట్రక్కు ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. ఐదుగురికి గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని బార్మర్‌లోని ఆస్పత్రికి తరలించారు. చౌహాన్ టౌన్ నుంచి వస్తోండగా ట్రక్కు అదుపుతప్పి లోయలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది.

## వృద్ధ తండ్రిని హత్య చేసిన కుమారుడు

లక్నో,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్‌లోని జలాన్స్ ప్రాంతంలో 75 ఏళ్ల వృద్ధుడిని కుమారుడు హత్య చేశాడు. కోంఛ్ ప్రాంతంలోని తెహరపూర్ గ్రామంలో హనమంత్ సింగ్ అనే వ్యక్తి తన తండ్రి సర్జు ప్రసాద్ (75)కు డబ్బులు ఇవ్వబోయాడు. కుమారుడిపై కోపంగా ఉన్న తండ్రి ఆ డబ్బులను తిరస్కరించాడు. దీంతో సర్జు ప్రసాద్‌పై హనమంత్ సింగ్ దాడి చేశాడు. దీంతో సర్జు ప్రసాద్ ఘటనా స్థలంలో మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

# అమెజాన్ కార్యకలాపాలు ప్రారంభం



### లాంఛనంగా ప్రారంబించిన హోంమంత్రి మహ్మూద్ అలీ

హైదరాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అమెజాన్ సంస్థ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అమెజాన్ సంస్థను రాష్ట్ర హోంమంత్రి మహముద్ అలీ ప్రారంభించారు. అనంతరం అక్కడ మహముద్ అలీ మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు, కంట్రీ మేనేజర్ అమిత్ అగర్వాల్, సంస్థ స్థిరాస్తి, వసతుల మేనేజర్ జాన్ స్కోట్లర్, ప్రభుత్వ ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు. నానక్‌రామ్‌గూడలో 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ క్యాంపస్ ప్రపంచంలోనే అతిపెద్దది. 2016, మార్చి 31న అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్.. అమెజాన్ సంస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 15 అంతస్తులుగా 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ క్యాంపస్‌ను నిర్మించారు. ప్రస్తుతం ఈ సంస్థలో 7 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వచ్చే నెలాఖరు నాటికి ఉద్యోగుల సంఖ్య పది వేలకు చేరుకోనుంది. హైదరాబాద్ క్యాంపస్ నుంచి అమెజాన్ అంతర్జాతీయ కార్యకలాపాలు నిర్వహించనుంది.




సామాజిక తత్వవేత్త బిఎస్ రాములు జన్మదిన వేడుకలో భాగంగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సాహిత్య సమాలోచనా జాతీయ సదస్సులో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్, చిత్రంలో బిఎస్ రాములు, డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆచార్య వి.రామచంద్రం తదితరులు

## చరిత్రలో నేటినిజం



ఆ కలనే మరపించుచు
చీకాకుల వాలగ జేయు జీవితాన్ని - తెరపై
తేకువగా నటియించుచు
రాకాశశి వైతె వెలుగు "చిరంజీవి" ఘనాభిన

( ఆగష్టు 22 నటుడు చిరంజీవి జననం)

-రాధశ్రీ
సెల్: 9494481210



# వృద్ధులే స్ఫూర్తి ప్రదాతలు

## సమాజ మార్గనిర్దేశకులు వారే-వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్









సమాజానికి స్ఫూర్తినిచ్చేది, మార్గదర్శకంగా నిలిచేది వృద్ధులేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు బుధవారం కమలాపూర్ మండల కేంద్రంలో ఈటల నిషాంత్ 12వ వర్ధంతి, **'నాన్న నీకు నూరేళ్ల'** పుస్తకావిష్కరణ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యా రు. మంత్రి తండ్రి ఈటల మల్లయ్య కు నూరేళ్లు నిండటంతో మంత్రి అన్న ఈటల సమ్మన్న 'నాన్న నీకు నూరేళ్లు" అనే పుస్తకాన్ని రాశారు. పుస్తకాన్ని మంత్రి ఈటెల రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకాన్ని మంత్రి ఈటెల రాజేందర్, అన్న ఈటల సమ్మన్న, తమ్ము ఈటెల భద్రయ్య తండ్రి ఈటల మల్లయ్యకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో ముసలివాళ్లంటే పనికిరాని వాళ్లుగా భావిస్తున్నారన్నారు. ముసలివాళ్ళు తమ అనుభవాలతో సమాజానికి స్ఫూర్తినిస్తూ మంచిని అందిస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలుగా అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు కలిసి గొప్పగా ప్రేమానురాగాలతో బతికేవారని గుర్తుచేశారు. నేటి సమాజంలో ఆస్తులకోసం రక్త సంబంధీకులైన అన్నతమ్ముళ్లు, అక్కాచెల్లెలు, అని చూడకుండా చంపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యం రాగానే తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్చుతున్నారని, దీంతో మానవ సంబంధాలు తెగిపోతున్నాయన్నారు. వృద్ధులని వారసత్వ సంపదగా భావించాలని సూచించారు. మంత్రి ఈటల నిషాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈటల నిషాంత్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకారాలను మంత్రి అందజేశారు. కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరామనంద తీర్థ ట్రస్టు నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ సర్టిఫికెట్లను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. వెంకట నారాయణ, నంది అవార్డు గ్రహిత బ్లిమ్, ఎంపీపీ తడకరాణి, జెడ్పీటీసీ లాండిగ కళ్యాణి, సర్పంచ్ కట్కూరి విజయారెడ్డి, ట్రస్టు డైరెక్టర్లు డాక్టర్ దాసి సాంబయ్య, డా॥ మల్లిఖార్జున్, మల్లికార్జున్‌దేవ్, ప్రొఫెసర్ రావు, క్రిష్ణకుమారి, వైద్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## "కావూరి పరిశోధనలు" పుస్తకావిష్కరణ



రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆల్ ఇండియా బ్రాహ్మణ సంఘాల జేఏసీ, మంత్రరాజపీఠంల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి డా॥ కావూరి శ్రీనివాస్ రచించిన తెలంగాణలో బౌద్ధంపై కావూరి కొన్ని పరిశోధనలు పుస్తకావిష్కరణ జరిగింది. శ్రీవిద్యా గణేశానంద భారతీతీర్థ స్వామి, విశ్రాంత న్యాయమూరి కొండవల్లి లక్ష్మీ నరసింహారావు, పండితులు వితల సిద్ధిరామశర్మ, బి.జే.పి. మహిళా నాయకురాలు కొత్తూరు గీతామూర్తి, న్యాయవాది రమాశంకర్, కవి, డా॥ఎ. రవీంద్ర తదితరులు అతిథులుగా పాల్గొని డా॥కావూరి శ్రీనివాస్ చేస్తున్న కృషికి ఆయన్ని అభినందించారు.



తెలంగాణ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్, పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన-2019 ఉత్తమ రాష్ట్ర స్థాయి ఫోటో అవార్డుకు ఎంపికైన నమస్తే తెలంగాణ సీనియర్ ఫోటోగ్రాఫర్ గడసంతల శ్రీనివాస్‌కు అవార్డును అందజేస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్.మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, సంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ, ఫోటో జర్నలిస్టు అధ్యక్షుడు జి. భాస్కర్ తదితరులు



సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ (ఎస్ఏపీ) ఆధ్వర్యంలో సోమవారం సోలార్‌జంగ్ మ్యూజియంలో ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న హెూంమంత్రి మహమూద్‌అలీ, మామిడి హరికృష్ణ, డా॥ పత్తిపాక మోహన్, నాగేందర్‌రెడ్డి తదితరులు.




# వేడెక్కుతున్న రాజకీయాలు

హైదరాబాద్, ఆగష్టు 21: దేశంలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. ఓ వైపు చిదంబరం కేసుతో పాటు, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో బిజెపి దూకుడు ప్రదర్శిస్తోంది. అధికార పార్టీలను విమర్శిస్తూ దూసుకుని పోతోంది. మధ్యలో కాంగ్రెస్ కూడా విమర్శలతో వాతావరణాన్ని వేడెక్కిస్తోంది. తాజాగా జెపి నడ్డా హైదరాబాద్ సభలో కెసిఆర్, టిఆర్ఎస్‌కు మాట్లాడడం, పలువురు వివిధ పార్టీలకు చెందిన వారు బిజెపిలో చేరడంతో ఆ పార్టీలో నూతనోత్సాహం కలుగుతోంది. అయితే ఇంతటితో ఆ ఆపర్టీ ఆగడం లేదు. పడుకున్న వారిని తట్టి లేపుతోంది. అవకాశాలు లేకుండా మూలన వద్ద వారిని కూడా పార్టీలోకి ఆహ్వానిస్తోంది. ఇకపోతే నడ్డా చేసిన విమర్శలపై కెటిఆర్ ఘాటుగానే స్పందించారు. ఇది కర్నాటక కాదని, ఇక్కడ బిజెపి రాజకీయాలు సాగవన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నడ్డా అనేటాయన తనకు తెలియదన్న ప్రకటనే ఆయనను వప్పులో కాలేసేలా చేసింది. ఎందుకంటే నడ్డా కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో కెటిఆర్ వెళ్లి కలసిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విమర్శలు చేసేముందు కెటిఆర్ కొంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటన రుజువు చేసింది. ఇకపోతే ఎపిలో కూడా బిజెపి నేతలు అధికార వైకాపా లక్ష్యంగా విమర్శలకు దిగుతున్నారు. వరదప్రమాదంతో పాటు, పోలవరంపై వైకాపాను లక్ష్యంగా చేసుకుని బిజెపి విమర్శలకు పదను పెడుతోంది. బెంగాల్‌లో మమత నిరంకుశత్వం మితిమీరి పోవడంతో అక్కడ బిజెపి వేసిన ఎత్తు ఫలించింది. ఇప్పుడు తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితులను గమనించిన బిజెపి ఇక్కడా ముందుకు దూసుకువస్తున్నది. కాంగ్రెస్ మీద, కోదండరామ్ మీద, వామపక్షాల మీద ప్రయోగించిన అణచివేత అస్త్రాలను, యుక్తులను కెసిఆర్ బిజెపి మీద ప్రయోగించడం అసాధ్యం. అందుకే బిజెపి కూడా తాడోపేడో అన్నచందంగా ముందుకు సాగుతోంది. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచనపై గట్టిగానే పోరాడుతోంది. నిజానికి ఈ విషయం లో కెసిఆర్ కొంత పట్టు సడలించి ఉంటే బిజెపికి ఎదురుదెబ్బ తగిలేది. కానీ సిఎం కెసిఆర్ వీటిని గమనిస్తున్నట్లుగా లేదు. ప్రజల్లో తనపట్ల వ్యతిరేకత పెరుగుతోందన్న విషయాన్ని దరిచేరనీయడం లేదు. ఇదే అదనుగా అమితషా తన చాణక్యాన్ని తెలంగాణలో ప్రదర్శిస్తున్నారు. 370 రద్దు తరవాత ఎవరు అంగీకరించినా అంగీకరించక పోయినా బిజెపి అతిపరాక్రమ పార్టీగా అవతరించింది. మోడీ,అమిత్‌షాల ద్వయానికి సామాన్య ప్రజల్లోనూ అనూహ్య ఆదరాభిమానాలు పెరిగాయి. వాటిని అంగీకరించకుండా రాజకీయాలు చేస్తే బొక్కబోర్లాపడతారు. ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీలు తమ వైఖరిలో మార్పునకు సిద్దంగా ఉండాలి. ప్రజల ఎజెండాతో పాలన సాగించాలి. వై.ఎస్. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే, అవినీతికి ఆస్కారం లేని పాలన గురించి పదేపదే మాట్లాడుతుంటే, వినేవారికి కొంత ఎబ్బెట్టుగానే అనిపించేది. ఆయన మీద ఉన్న కేసులు, వాటి విచారణ జరుగుతున్న వేళ జగన్ అవినీతి వ్యిరేక పాలన గురించి మాట్లాడితే సహజం ఆనే ప్రజలకు ఎక్కలేదు. అందుకే తెలుగుదేశం వారు ఇదే అదనుగా జగన్ అవినీతినిపదేపదే ఎత్తిచూపడానికి ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ వికాస సమితి వారి వార్షికోత్సవ సభల్లో తెలంగాణ రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ మాట్లాడుతూ ప్రశ్నించే స్థితి లేకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదం అంటూ చేసిన వ్యాఖ్యలు కూడా తెలంగాణ వాదులకు ఆశ్చర్యం కలిగించాయి. ఎందుకంటే ఇప్పటి వరకు ఎవరికి కూడా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఎదురుదాడితో సాగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పాలనలో అప్రజాస్వామిక వాతావరణం నెలకొన్నదన్న విమర్శలు ఉన్నాయి. కెసిఆర్ అందుబాటులో ఉండరని, ఎవరినీ కలవరని ప్రచారంలో ఉంది. కెటిఆర్ కూడా బిజెపి లక్ష్యంగా వ్యాఖ్యలు చేశారే తప్ప అవి తమకే అన్వయం అవుతాయని ఆయన భావించి ఉండరు. రాష్ట్రంలో నెలకొన్న వాతావరణం మీద ఆయనకు ఎలాంటి అభ్యంతరం లేకున్నా, బిజెపి పరంగా మాత్రం తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని చెప్పడానికే కెటిఆర్ అలా మాట్లాడి ఉంటారు. అందుకే నడ్డ ఎవరో తెలియదన్నారు. ఆయనో అక్రమాల అడ్డా అన్నారు. బిజెపి ఆటలు ఇక్కడ సాగవన్నారు. కొందరు కొన్ని మాటలు మాట్లాడుతుంటే సహజంగా ఉంటుంది. అవే మాటలు ఇతరులు మాట్లాడితే, ఎబ్బెట్టుగా, అసహజంగా అనిపించవచ్చు. కెసిఆర్ ఇలాంటి మాటలు ఎన్నో సందర్భాల్లో వాడారు. అయితే ప్రజలు వాటిని స్వాగతించారు. కానీ కెటిఆర్ మాట్లాడితే ఏవగించు కుంటున్నారు. మొత్తంగా ఇప్పుడు కాళేశ్వరం అవినీతి,కుటుంబ పాలన, తెలంగాణ విమోచన చుట్టూ రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ దశలో ఎక్కడ ఏ మాత్రం అవినీతి కేసులు దొరికినా వదిలి పెట్టకుండా బిజెపి నేతలు చూస్తున్నారు. చిదంబరం లాంటి కాకలు తీరిన రాజకీయ దురంధురుడి పరిస్థితి ఇప్పుడు చిప్పకూడుకు దగ్గరవుతోంది. అమిత్‌షా లాంటి అపర చాణక్యులకు ఎవరు కూడా ఆత్మీయులు కారు. పాలనలో తమదైన ముద్రవేస్తూ ముందుకు సాగుతున్న వేళ రాజకీయంగా కూడా తెలంగాణ ,ఎపిల్లో అనుకూల వాతావరణం సృష్టించుకుంటున్నారు. ఈ దశలో తప్పటడుగులు వేయకుండా టిఆర్ఎస్ ప్రజలకు చేరువగా ఉన్నంతకాలం బిజెపి కూడా ఏమీ చేయలేదు.


AKHILA BHARATIYA BHASHA SAHITYA SAMMELAN (Regd.), BHOPAL

31st ANNUAL CONFERENCE

Date : 25-08-2019 Venue : LIONS BHAVAN, Secunderabad

Inauguration & Release of Souvenir :10.00 AM

| | | |
|---|---|---|
| Chief Guest | : | Sri G. Kishan Reddy<br>Hon'ble Minister for State Home Affairs, GOI |
| Guest of Honour | : | Dr. Avula Manjulatha<br>Ex. Vice Chancellor, P.S. Telugu University |
| President | : | Dr. Satish Chaturvedi<br>National President, ABBSS - Bhopal |
| Presides by | : | Acharya Kadari Satya Murthy<br>President, Telugu Sakha-ABBSS, Telangana |
| Special Guests | : | Sri P.V. Brahmam<br>Chairman, Reception Committee<br>Dr. B. Jayaramulu<br>President, Viswasahiti<br>Sri Kala V.S. Janardhana Murthy<br>President, Sri Thyagaraya Gana Sabha |
| Welcome | : | Sri Tangirala Chakravarthy<br>Secretary, Telugu Sakha, ABBSS. |
| Vote of Thanks | : | Smt. G. Padmavathi<br>President, Mahila Wing, Telugu Sakha, ABBSS. |

GENERAL BODY MEETING : 12.00 PM

| | | |
|---|---|---|
| Presides by | : | Dr. Satish Chaturvedi<br>National President, ABBSS, Bhopal. |

KAVI SAMMELANAM : 2.00 PM to 4.00 PM

| | | |
|---|---|---|
| Chief Guest | : | Dr. Anugu Narasimha Reddy<br>Secretary, T.S. Sahitya Academy |
| Guest of Honour | : | Dr. Mariya Kumar |
| Presides by | : | Dr. Jayaramulu |
| Organiser of Kavi Sammelanam | : | Smt. G. Padmavathi |

AWARDEES & DELEGATES FELICITATION :

4.30 PM to 6.30 PM

| | | |
|---|---|---|
| Chief Guest | : | Sri P.V. Manohar Rao<br>President, Sarvartha Sankshema Samithi |
| Presides by | : | Dr. Satish Chaturvedi<br>National President, ABBSS, Bhopal |
| Special Guests | : | Dr. Puligadda Vijaya Lakshmi<br>Dr. V.K. Ananda Prabhu<br>Dr. Lalithavani<br>Dr. K. Ramakrishna<br>Dr. Aduvala Sujatha<br>Smt. Akella Venkata Subba Lakshmi |
| Vote of Thanks | : | Smt. Ravi Durga Prasanna |

AWARDEES 2019

| | | |
|---|---|---|
| Prof. Vaijyanath Chaturvedi Smruthi Rashtriya Samman | - | Acharya Kadari Satya Murthy, Hyderabad. |
| Dr. Chandra Prakash Varma Rashtriya Smruthi Alankar | - | Dr. Mariya Kumar, Hyderabad. |
| Dr. Pothukuchi Sambasiva Rao Memorial Excellence Award | - | Sri Ramakrishna Perugu, Nellore. |
| Saraswati Samman | - | Dr. Vaddepalli Krishna |
| Bharat Bhasha Bhushan | - | Dr. Aduvala Sujatha |
| Samskrithi Bhushan | - | Dr. Kalavakunta Rama Krishna<br>Sri V. Raghava Rao (Raghu Sree) |
| Rashtriya Samvadasri | - | Sri Bisa Devadas |
| Sahitya Sri | - | Smt. Vadapalli Padmavathi Devi<br>Smt. Chindam Sunitha<br>Smt. K. Lalitha<br>Smt. M. Hymavathi, A.P. |
| Samanvayasri | - | Smt. Lakshmi Narusu<br>Smt. R.V. Madhuri Gopal |

Satish Cheturvedi
National President

Acharya Kadari Satya Murthy
President, Telugu Sakha

# ఉమ్మడి పోరాటంలో కలసిరాని విపక్షం

న్యూఢిల్లీ,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): మోడీ పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితి దిగజారిందని లెఫ్ట్ సహా అన్ని పార్టీలు విమర్శిస్తున్నాయి. 370 ఆర్టికల్రద్దుతో ఈ పార్టీలు మోడీ హవా పెరిగిపోవడాన్ని జీర్ణించుకోలేక పోతునయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడిందని ధ్వజమెత్తారు. 2002 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ ప్రగ్భాలు పలుకుతున్నాడని, కానీ మరోపక్క గత ఏడాదిన్నరలో గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం తగ్గిందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నా యని గుర్తు చేశారు. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అయితే పార్టీల్లో ఐక్యత లేకపోవడం, సమస్యలపై పట్టు లేకపోవడం వల్ల విపక్షాలు సమిష్టిగా రాణించలేక పోతున్నాయి. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకు పోయిందంటున్నారు. దేశంలో రైతుల వద్ద భూములను బలవంతంగా లాక్కొంటున్నారని విమర్శించారు. నరేగా కేటాయింపులను 50శాతం తగ్గించారని, ఫలితంగా 20 రోజుల మాత్రమే పని ఉంటుందని అన్నారు.

### సమస్యలను ఎత్తిచూపడంలో విఫలం

దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారని, బిజెపి వారిపై దాడి చేస్తోందని విమర్శించారు. రైతులు, కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారని, నాలుగేళ్ల మోడీ పాలన అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోందని, ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారని దుయ్యబట్టారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యిందన్న దానిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటీకరణ చూశామని, కానీ ఇప్పుడు ప్రభుత్వ పాలనను కూడా ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ సర్కార్ సన్నద్ధమౌతోందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తులను ప్రభుత్వ పాలనలోకి తీసుకొచ్చేందుకు మోడీ తహతహలాడుతున్నారని విమర్శించారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదని, ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయని అంటున్నారు. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొం టున్నారని, సమస్యలను పరిష్కరించడంలో మోడీ సర్కార్ విఫలం అయ్యిందని అంటున్నా, ఉమ్మడి కార్యాచరణలో విపక్షాలు విఫలం అయ్యాయి.

## ఆస్తిపన్ను వసూళ్లలో వెనకడుగు

మహబూబ్‌నగర్,ఆగస్ట్21 (ఆర్ఎన్ఎ): మున్సిపాలిటీలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ఆస్తిపన్ను బకాయి లతో బడా బాబులు తలలు పట్టుకు ంటున్నారు. మున్సిపల్ అధికారులు గతంలో చేసిన కొలతల కన్నా ఎక్కువగా రావడంతో గతంలో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసారు. తరవాత కూడా బడా బాబులు చెల్లింపుల్లో మార్పురావడం లేదని సమాచారం. పాలమూరు పట్టణంలో బడా వ్యాపారవేత్తలు ఆస్తిపన్ను ఇప్పటికీ చెల్లించలేదని తెలిసింది. ఇటీవల మున్సిపల్ అధికారులు వ్యాపారులతో చర్చించి ఆస్తిపన్ను చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. తప్పుడు కొలతలు చేసి ఆస్తిపన్ను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ తప్పించుకో జూశారు. అయితే వారితో మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిపై విచారణ చేపట్టేందుకు కూడా ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు ఇప్పటికే పలుమార్లు పన్నులు చెల్లించాల్సిన తేదీలను వాయిదా వేశారు. తక్కువ మొత్తంలో పన్నులు వసూలు కావడం అధికారులకు సవాల్‌గా మారింది.

సామాజిక తత

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 22-8-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

మానవ గుండె
ట్రీడిలో పదిలం
జర ఊరట.

కొత్త పాటలు
పంజరంలో కోకిల
సముద్ర గీతం.

మరో నక్షత్రం
కానున్నది జీవ క్షేత్రం
పదండి పోదాం

ప్రవాహ హెూరు
అల్ప జీవి కన్నీరు
తీపి మాటలు

ప్రతి పక్షాలు
మారుతున్న గొంతులు
ద్రోహ చింతన.



- రేడియమ్
9291527757

### శ్రీనిజాలు

అయ్యొయ్యో రామరామ!
అత్తను చంపిన కోడలు!!
అయ్యొయ్యో కృష్ణకృష్ణ!
తండ్రిని చంపిన కొడుకులు!!

పెద్దోళ్ళను కడతేర్చిన
హంతకులు చంటివాళ్ళే
యమదూతలెవరోకాదు
అందరూ ఇంటివాళ్ళే



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

### సాంత్వన

మనుగడ ప్రశ్నార్థకమై
మనసుకు సాంత్వనము లేక
నిరాధార బాధాకర జీవనం
దురాచారంగా మారిన
ప్రాచీనాచారం చివరకు
చారిత్రక పతనం
హృదయ వేదనగా మిగిలిన
సత్వర తలాక్ విధానం
ఇకపై చెల్లదు
ముస్లిం స్త్రీలకు జరుగుతున్న
చారిత్రక అన్యాయానికి అడ్డుతెర
సమానత్వ సామాజిక న్యాయానికి విజయం
ముమ్మారు తలాక్ దురాచారంతో
చితికిన బతుకులకు
ఎడారిలో ఒయాసిస్సులా
మీ తోడుగ నేనున్నానంటూ
మహిళల వివాహ హక్కులు
పరిరక్షణ చట్టం, వచ్చి
తలాక్‌కే తలాక్ చెప్పెను
కారు చీకటిలా కాంతి రేఖలా
అగమ్య గోచర జీవన మార్గదర్శిగా
నిర్వేదన బతుకులో
నవ వసంత శోభను నింపును
ఇక మీదట మీ చిరునవ్వులు
ఎప్పటికి వాడని పువ్వులు.



- కసిరెడ్డి జలంధర్‌రెడ్డి
96034 99248

### నేటి స్త్రీ

కొండరాయిని శిల్పి చెక్కినట్లు
సమాజాన్ని ఎంత అందంగా చెక్కినా
శిల్పానికి శిల్పి ప్రాణం పోయలేనట్టు
సమాజంలో నువ్వు సమన్యాయం చేయలేవు
'అ' అంటే అమ్మ అని అంటావే కాని
అమ్మమాట నువ్వెప్పుడు విన్నావని
ఆకాశంలో సగం అంటావు
ఆడపిల్లకి కడుపులోనే సమాధి కడతావు
మూడుముళ్ల బంధంతో కట్టుకొని
వేధిస్తుంటావు నిత్యం వరకట్నమని
అందర్నీ ఒదులుకొని దేవతలా
నీ గుమ్మంలో అడుగుపెట్టిన యిల్లాలిని
వంటింటి గర్భగుడికే అంకితం చేస్తావు
ఆడపిల్ల ఎదుగుతుంటే చాలు
అడుగడుగునా ఆటంకాలు
అయినా ఎదిగే తీగని
ఆపటం ఎవరి తరమని
హిమాలయాన్ని ఎక్కటమే కాదు
ఆకాశంలోనూ నడిచింది
పాతాళాన్ని శోధించింది
అంతరిక్షంలో మహిళ
తనపేరు రాసుకొచ్చింది
అమ్మగానే కాదూ మిత్రమా!
మహిళగా రాజకీయాలేలింది
పురుషాధిక్య సమాజాన్ని ధిక్కరించి
సరికొత్త చరిత్ర సృష్టించింది
నేటి సమజంలో స్త్రీ
సాధికారికంగా జెండా ఎగరేసింది
ఆపటం నీ తరమా
ప్రపంచం నీ పరమా
నీ అహంకారాన్ని చంపుకుంటేనే కాని
స్త్రీని గౌరవించటం నేర్చుకోలేవు.



- గుర్రాల రమణయ్య
9963921943

### మట్టి పరిమళం

పిడికిలిలో బంధిస్తే
దేశభక్తి పొంగి పొరలు
తొలి చినుకులు తాకగానే
పరిమళాలు పంచిపెట్టు!

నా మూలమే కాదు
బతుకు పరమార్థమూ నీవే
నీ గర్భ గుడిలోనే కదా
విత్తుకు ఆయువు పోస్తవు!

నీ సారమే మా అన్నం
నీవే మాకు ఆధారం
నీ గొంతు ఎండిన నాడు
మా కడుపులన్నీ మాడు
మోడు కూడ చిగురించక!

నీర్జీవమైన నేమి?
జీవికి పురిటి గడ్డనీవే
బిడ్డగ పోషిస్తూనే
కడకు అమ్మ ఒడి అవుతవు!

అన్నదాతవే కాదు
ప్రాణ ప్రదాతవూ నీవే
నీవే మా చిరునామా
సకల సౌభాగ్యాల సీమ!



- డా॥బుర్ర మధుసూదన్‌రెడ్డి
9949700037

# కవయిత్రి లక్ష్మీమైత్రి రచించిన 'కరచాలనం' కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రముఖ కవయిత్రి లక్ష్మీమైత్రి రచించిన కవితా సంపుటి 'కరచాలనం' ఆవిష్కరణ సభ ధర్మకేతనం సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభ దీక్షితులు కళావేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డా॥ టి. గౌరీశంకర్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవిత్వం మనిషిని ఆలోచింపజేస్తుందని, అహాన్ని పారద్రోలి ఆనందాన్ని కల్గిస్తుందని గౌరీశంకర్ అన్నారు. ప్రముఖ కవి, రచయిత రమణ వెలమకన్ని అధ్యక్షత వహించారు. నెల్లూరు వాస్తవ్యురాలైన శ్రీమతి ములుగు లక్ష్మీ మైథిలి తన కవిత్వ పుస్తకాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కరింప జేయడం తెలుగు రాష్ట్రాల ఐక్యతను చాటి చెప్పినట్టుందని రమణ వెలమకన్ని అన్నారు. మంచి కవిత్వాన్ని రాస్తున్నందుకు అభినందనలు తెలిపారు. గౌరవ అతిథిగా నేటినిజం సంపాదకులు బైస దేవదాసు పాల్గొన్నారు. సమస్యలు లేకుండా ఏ మనిషి జీవించి వుండలేరని, సమస్యను పరిష్కరించుకుంటూ మనుగడ సాగించడం మనిషి కర్తవ్యమని బైస దేవదాసు అన్నారు. లక్ష్మీ తన కూతురు మైథిలి




'కరచాలనం' కవితా సంపుటి ఆవిష్కరణలో ములుగు చంద్రశేఖర్‌రావు, బైస దేవదాసు, కవయిత్రి ములుగు లక్ష్మీ మైథిలి, డా॥ టీ. గౌరీశంకర్, రమణ వెలమకన్ని, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, సరికొండ నరసింహరాజు, పెద్దూరి వెంకటదాసు.

క్యాన్సర్ వ్యాధితో కన్ను మూసిం తర్వాత తనలోని ఆవేదనను కవిత్వ రూపంలో అక్షరీకరించుకుని సేద తీరారని సమాజంలో ఎంతో మంది ఎన్నో బాధలతో అలమటించడం గ్రహించి, అవగాహన చేసుకుని చైతన్యవంతమైన కవిత్వం లక్ష్మీ మైథిలి రాస్తున్నారని బైస దేవదాసు అభినందించారు. కవి సరికొండ నరసింహారాజు పుస్తక సమీక్ష చేశారు. ఇదే వేదికపై సినారెతో అవార్డు తీసుకున్నానని, అందుకే నా పుస్తకాన్ని ఇక్కడే ఆవిష్కరించుకునే అవకాశం కలిగినందుకు ఆనందంగా వుందని కవయిత్రి లక్ష్మీ మైథిలి తన స్పందనలో తెలిపారు. కవయిత్రిగా ఎదగడానికి తన భర్త అండదండలు మరువలేనివని అన్నారు. కవి, రచయిత వెంకటదాసు సభ సమన్వయం చేశారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు ఎన్వీ రఘువీర్ ప్రతాప్ పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో శిష్టా మాధవి, జ్యోతిరాజ్, విజయలక్ష్మి, వెంకటనారాయణ, తంగిరాల చక్రవర్తి, నారాయణరెడ్డి, శరత్‌చంద్ర, దశరథరామయ్య, ఆంజనేయులు, రాధాకృష్ణ, కిషన్‌రావులు కవితలు చదివి ఆకట్టుకున్నారు.

# అమ్మ నాన్న ఓ కవిత!

### పుస్తక సమీక్ష

కరీంనగర్ భవానీ ప్రచురణలు వారు డా॥వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో "అమ్మ నాన్న ఓ కవిత" కవితా సంకలనాన్ని వెలువరించినారు. రెండు తెలుగ రాష్ట్రాల్లోని 140 మంది కవులు, కవయిత్రులు అమ్మా నాన్నలపై కవితలు రాసి పాఠకుల మెప్పించ యత్నించారు. వర్థమానులు, ప్రవర్థమానులు రాసిన ఇందలి కవితలు అమ్మా నాన్నల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించేలా కొలువుదీ రాయి.

**డి నాగజ్యోతిశేఖర్ మురమళ్ళ** రాసిన "ప్రకృతీ వురుషులు'' కవిత కవితాత్మకంగా మలచబడింది. రెప్పల చాటున శ్రమల నిప్పులు దాచి.. నిత్యం సంతతి కలిమి స్వప్నాలను చెక్కిన ఓర్పు నయనాలు అంటూ కొనసాగించిన పంక్తులు కవితకు నిండు శోభను కూర్చాయి. **శ్రీలక్ష్మి చివుకుల** అమ్మనాన్నలను కనిపించే కల్పతరువులుగా వర్ణిస్తే.. **నాయని రాములు** మాతృవందనం శీర్షికతో ఓ గేయాన్ని రాశారు. అమ్మ ప్రేమే సకల సృష్టికి మూలాధారమని తేల్చిచెప్పారు. **రామారత్నమాల** అమ్మ నాన్నల ప్రేమ అజరామరం అని అంటే.. అమ్మ ప్రేమ అనంతమని **నారాయణ ముసులూరు** తమ కవితలో ఆవిష్కరించారు.

అమ్మ మాటనేర్పితే.. నాన్ననడక నేర్పుతాడని అవధానం **అమృతవల్లి** పేర్కొంటే.. **కోపూరి అనిల్‌కుమార్** స్త్రీమూర్తి యొక్క ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. **పులిజమున** మొగ్గలు ప్రక్రియలో అమ్మను గొప్పగా ఆవిష్కరించారు.

అమ్మనాన్నలతో ఉన్న మధుర స్మృతులను **కానాల విజయలక్ష్మి** పంచుకుంటే.. **మంచికట్ల శ్రీనివాస్** తమ అమ్మతో ఉన్న అనుబంధాన్ని అక్షరాల్లో బంధించారు. **బెహ రా ఉమామహేశ్వర రావు** తమ అమ్మనాన్నలతో ఉన్న మధుర స్మృతులకు అక్షరాకృతినిచ్చారు.అమ్మ అనెడి మాట అనురాగపు పూదోట అని **బాలసాని కొమురయ్య** అంటే.. అమ్మప్రేమలోని తియ్యదనాన్ని.. నాన్న ప్రేమలోని కమ్మదనాన్ని **రౌత్రె శ్యామల** తమ కవిత ద్వారా తెలియజెప్పారు. **ఆర్. మాధవి** తమ జననీ జనకులను ఆది గురువులగా అభివర్ణిస్తే.. **వెల్ముల జయపాల్‌రెడ్డి** తమ నాన్నను వెలుగుల సూరీడుగా మన ముందు నిలిపారు. అమ్మ నాన్నల ఔన్నత్యాన్ని చాటుతూ **దాసరి శ్రీనాథ్‌గౌడ్** కవితను రాస్తే.. అమ్మను పుణ్య పుడమిగా **వెంకటరెడ్డి లచ్చిరెడ్డి** అమరకుల వర్ణిస్తే.. **తాండ్ర చిరంజీవి** అమ్మ నాన్నలను ప్రత్యక్ష దైవాలుగా ఆవిష్కరించారు. **వి. యోగానంద నాయుడు** అమ్మ నాన్నల రక్తబంధపు సవ్వడులను వినిపించారు. వృద్ధాప్యంలో అమ్మ నాన్నలను ఆదరించాలని **బత్తుల మురలీకృష్ణ** కోరారు.

బాపురం నరహరిరావు అమ్మ నాన్నలను దైవ స్వరూపులుగా ఆవిష్కరిస్తే.. **టి. కిరణ్మయి** అమ్మ ప్రేమలోని మాధుర్యాన్ని తమ కవిత ద్వారా తెలియజెప్పారు.

అమ్మ.. జీవితానికి అమృతాన్ని పంచియిస్తే.. నాన్న.. జీవితాన్నే అమృతమయం చేస్తాడని **శ్రీదేవి సురేష్ కుసుమంచి** పేర్కొంటే.. భానుశ్రీ కొత్వాల్ నాన్నను మహాయోధుడిగా. మహనీయుడిగా వర్ణించారు. నాన్నను **గుడిపూడి రాధికారాణి** ఓ మార్గదర్శిగా చిత్రిస్తే.. **డా॥ వనపర్తి తిరుపతి** అమ్మనాన్నలను అక్షయ




పాత్రలుగా పేర్కొన్నారు. ప్రతి మూగ జీవిలో నువ్వే నాన్న అంటూ నాన్న గారికి ప్రేమతో **ఎం.వి. ఉమాదేవి** నాలుగు మంచి మాటలు రాశారు. నా బలం.. నా బలహీనతా నాన్నేనంటూ **శిష్టు సత్య రాజేష్** పేర్కొంటే అమ్మంటే.. సుధకళశం.. అమ్మంటే ఆకాశం.. నాన్నంటే మమకారం నాన్నంటే అధికారమని **శాడవీరారెడ్డి** పేర్కొంటే.. ఈ సృష్టిలో అందమైన పదం అమ్మ అంటూ 'అమృత వాక్యం' కవితకు **టి. మాధవి** రూపకల్పన చేశారు. సామల ఫణికుమారి నాన్నే నా నడిపించే శక్తి అని అంటే.. అమ్మరుణం తీర్చుకోవడానికి మరుజన్మకూడా చాలదని కోలంట్ల రామకృష్ణ పేర్కొన్నారు. అమ్మ నాన్నలు నా జీవితానికి చుక్కాని వెలుగులు అంటూ **బివివి సత్యనారాయణ** రాస్తే.. దుప్పటి రమేష్ బాబు తన కూతురిలో మరో అమ్మను చూస్తున్నామని పేర్కొన్నారు. కటుకం కవిత అమ్మను అమృత వర్షిణిగా వర్ణిస్తే.. నా పెదాల పలవరింత అమ్మ.. నా నవనాడుల స్పందన నాన్న అంటూ **నల్లు రమేష్** తమ కవితకు చక్కని ముగింపునిచ్చారు. **కాళంగి వసంత జెస్సన్** తమ "కంటిపాప" కవితలో నాన్నను ఉన్నతంగా చిత్రిస్తే.. **మాధవీలత.ఆర్** తమ నాన్నను శ్రేయోభిలాషిగా ఆవిష్కరించారు. అంబరమంత అనురాగాన్ని పంచేది అమ్మేనని **నూశెట్టి రవీంద్రనాథ్** అంటే.. అమ్మనాన్నలు ఇద్దరూ ఇద్దరే అంటూ **ఆచార్య గిడ్డి వెంకట రమణ** పేర్కొన్నారు. **గోస్కుల రమేశ్** తమ నాన్నను మౌనమునిగా వర్ణిస్తే.. **కె.చందన్‌రావు** అమ్మ యొక్క కమ్మని మనసుకు తమ కవిత ద్వారా అద్దం పట్టారు. కన్నవారిని కంటిపాపల్లా చూడాలని **గోస్కుల శ్రీలత** అంటే తల్లిదండ్రుల ఆనందం ఏ కోణంలో కొలుస్తాం? అని కనుమ ఎల్లారెడ్డి ప్రశ్నించారు. **'జనశ్రీ' జనార్థన్ కుడికాల** అమ్మనాన్నలపై గేయం రాస్తే.. **కుడికాల శశిధర్** తల్లిదండ్రుల అండ వుంటే కామ ధేనువు ఎంతరా? అని ప్రశ్నించారు. **మహ్మద్ షరీఫ్,** అమ్మనాన్నలను ప్రేమ మూర్తులుగా ఆవిష్కరిస్తే.. కోటిభావాల చక్కని మాట అమ్మ అని **సి.హెచ్. మంగ** పేర్కొన్నారు. పరిమి వెంకట సత్యమూర్తి తమ అమ్మను ప్రత్యక్ష దైవంగా ఆవిష్కరిస్తే.. **డా॥ చీదేళ్ళ సీతాలక్ష్మి** మాతృ హృదయాన్ని చక్కగా తెలియజెప్పారు. అమ్మకు సాటెవ్వరు లేరని **మల్లేల విజయలక్ష్మి** పేర్కొంటే.. మా నాన్న గురించి చెప్పడం అంటే.. నీలాకాశంలో చుక్కలను లెక్కించడం వంటిదని అడిగొప్పుల సదయ్య తమ కవితను చక్కగా ముగించారు. అమ్మను అవనికి మించిన అద్భుతంగా కలమట **దాసుబాబు** పేర్కొంటే.. ప్రత్యక్ష దైవాలలో ముందున్నది అమ్మేనని **పులిగడ్డ శ్రీరామచంద్రమూర్తి** అన్నారు. అమ్మనాన్నలను భక్తి భావాలతో ఆరాధించాలని ఆణివిళ్ళ రామం పిలుపునిస్తే.. మరుపురాని జ్ఞాపకం అమ్మ. ..మరువలేని మధురం నాన్న అంటూ **టి. సంయుక్తా కృష్ణమూర్తి** తమ కవితను కొనసాగించారు. ప్రేమ బంధానికి నిలువుటద్దం అమ్మ ప్రేమ అని **ఆలూరి విల్సన్** అంటే.. అమ్మే సర్వస్వం అంటూ పున్నం చందర్ నాగమల్ల తమ కవితను తీర్చిదిద్దారు. అమ్మలేనిదే లోకం లేదని **జక్కు కృష్ణమూర్తి** అంటే. మానవ జీవన శకటానికి అమ్మనాన్నలే చక్రాలని చెఱుకుపల్లి గాంగేయ శాస్త్రి పేర్కొన్నారు. మాతాపితరులు కారుణ్య మూర్తులని **కాపురెడ్డి శ్రీనివాసరావు** అంటే.. అమ్మనాన్నలు ఆదిదేవుళ్లంటూ **డా॥ రవీంద్ర** తమ కవితకు అక్షరాకృతినిచ్చారు. సృష్టికి ఆధారం అమ్మనాన్నలేనని **వేముల తిరుపతిరెడ్డి** అంటే.. సదాస్మరించే దేవుళ్ళు అమ్మనాన్నలేనని **గాజుల భారతి శ్రీనివాస్** పేర్కొన్నారు. అమ్మను ఆది దేవతగా వి. రాజారావు పేర్కొంటే.. అమ్మే సర్వస్వమని పేర్కొంటూ **పేగ లక్ష్మీరాజం** తమ పద్యాలను రాశారు. మా ఇలవేల్పులు అమ్మ నాన్నలు అని **లలితారెడ్డి** అంటే.. అమృతనాన్ని **బి. రాజారత్నం** తమ అక్షరాల్లో ఆవిష్కరించారు. ఎన్ని జన్మలైనా నీకే బిడ్డగా పుట్టాలమ్మ అంటూ **ఇస్రత్‌సుల్తానా** తమ అమ్మకు నీరా జనాలు సమర్పిస్తే.. నీ నడతే శిరోధార్యం నాయినా అంటూ **పసుల స్వామి శనార్థులు** ప్రకటించారు. వెలకట్టలేని నాన్న ప్రేమకు **సుజన్‌రాజు** అక్షర మాలికను సమర్పిస్తే... సమాజ నిర్మాణ పునాదిగా **విలాసాగరం రవీందర్** పేర్కొన్నారు. నాన్న ఎప్పుడూ అంతే అంటూ **కుమార స్వామి** కవిత రాస్తే.. **గౌర్రె రాజేందర్** అనురాగ దేవతగా అమ్మను ఆవిష్కరించారు. **సారపు గోవిందరాజులు** నాయనంటే మా నాయనే అంటూ తమ కవిత రాస్తే.. అమ్మను ఓ దేవతగా **రానాశ్రీ** ఆవిష్కరించారు. **ఆర్. విశాలక్షి** అమ్మ ఓ వరమని పేర్కొంటే. **తెలుగు తిరుమలేష్** అమ్మను విశ్వాదిశక్తిగా వర్ణించారు. **కొప్పుల ప్రసాద్** తరగని అమ్మ ప్రేమను ఆవిష్కరిస్తే.. నాన్నను తోటమాలిగా వర్ణిస్తూ **నన్నపురాజు రమేశ్వర రాజు** పేర్కొన్నారు. 'నాన్న జ్ఞాపకం' శీర్షికతో **అవినాష్ మంత్రి** కవితను రాస్తే.. అమ్మ నాన్నల ప్రేమ నందనవనమని **ఇమ్మడి రాంబాబు** పేర్కొన్నారు. అమ్మనాన్నలను **కళావతి కందగట్ల** కొలువైన దేవతలుగా పేర్కొంటే.. అమ్మ భావ రూప జీవని స్వభావ రూప కల్పిని జీవన గమన సంజీవని నాన్న భావ వ్యక్త నిగూఢత అంటూ **డా॥ విరంచి ముడుంబై ఆచార్య** తమ కవితను తీర్చిదిద్దారు. "శ్రీగం' అమ్మకు అమ్మై పుట్టాలని ఆకాంక్షిస్తే.. అమ్మనాన్నలే నా దేవుళ్ళు అంటూ **బేతు సునీల్ యాదవ్** తమ కవితను ముగించారు.మట్టిలో మాణిక్యం అమ్మ అంటూ **లక్ష్మీ వేణు గోపాల్** తమ కవితను కొనసాగిస్తే.. పెనుక ప్రభా కర్ తమ అమ్మతో ఉన్న అనుబంధాన్ని అక్షరాల్లో బంధించారు. అమ్మనాన్నల అనురాగ బంధాన్ని **గౌని అనూష** తమ కవితలో ఆవిష్కరిస్తే.. సృష్టికి మూలం అమ్మనాన్నలే అంటూ **జి. విజయలక్ష్మి** పేర్కొన్నారు. తర తరాల గౌరవంగా అమ్మను **మర్సకట్ల రామ కోటేశ్వరరావు** భావిస్తే.. నాకు అన్నీ ఇచ్చింది అమ్మనాన్నలు అంటూ **దుద్యాల రవీందర్** తమ కవితను కొనసాగించారు. అమ్మనాన్నలు వెలిగే నా కంటి దీపాలు అంటూ **చిందం సునీత** రాస్తే.. రంగరాజు పద్మజ అమ్మను అనురాగమయిగా, త్యాగమయి గా ఆవిష్కరించారు. **జి. సుజాత** అమ్మగా తమ అనుభవాలను అక్షరాల్లో ఆవిష్కరించారు. అమ్మనాన్నల అనురాగాన్ని **డి.జి.యస్. శ్రీనివాస్** అమ్మంటే బంధం.. నాన్నంటే బాధ్యత అని **ములుగు లక్ష్మీ మైథిలి** తేల్చి చెప్పారు.

'అమ్మ నాన్న' శీర్షికతో **సింహాద్రి శ్రీనివాసరావు** రాసిన కవితలో అమ్మప్రేమ అనంతమని తెలిపారు. **డా॥ తాళ్ళపల్లి యాకమ్మ** రాసిన కవితలో అమ్మ కోపం మాటున దాగిన ప్రేమను ఆవిష్కరించారు. అమ్మకు సాటి అమ్మే అంటూ **ఆ.వి.యల్. గాయత్రి** రాస్తే.. **డా॥ రామక కృష్ణమూర్తి** అమ్మ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారు. బియ్యన తిరుపతి 'అమ్మ పాట' పేరున ఓ గేయాన్ని రాశారు. అమ్మా, నాన్నల బాధ్యత నాదైనప్పుడే, స్వర్గానికి ద్వారం తెరుచుకున్నట్లు తోచిందంటూ **దుగ్గిరాల రాజ్యలక్ష్మి** అంటే.. అనురాగపు అల్లికలా.. మమకారపు మాలికలా మురిపించే మాతృమూర్తికి **కుడికాల సరోజ జనార్థన్** వందనం సమర్పించారు. అమ్మ తోడుంటే.. జగమంతా నాదేనని **బి. సుధాకర్** నినదిస్తే.. కళాజ్యోతి కుడికాల తమ తొలినేస్తం నాన్న అని అంటే.. **జి. నాగమోహన్ కుమార్ శర్మ** పూజ్యనీయులైన తల్లిదండ్రులకు అక్షర నీరాజనం సమర్పించారు. **అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాస మూర్తి** నాన్నతో పంచుకున్న మధురానుభూతులను పంచుకున్నారు. అమ్మ నాన్నల ప్రేమ లేకున్న.. లోకాలు సున్న అని **కొలకలూరి దేవి రత్నాకర్** అంటే **అద్దేపల్లి జ్యోతి** తల్లిదండ్రుల గొప్పదనాన్ని చాటి చెప్పారు. మమతాను రాగాలకు చిరునామా మా బంగరు నాన్న అంటూ **చయనం అరుణాశర్మ** రాస్తే.. ఔను అమ్మ అమ్మే అంటూ ప్రభాశాస్త్రి జోశ్యుల పేర్కొన్నారు. తన భవిష్యత్తును తీర్చిదిద్దిన నాన్న పట్ల **నన్నపురాజు విజయశ్రీ** గౌరవ భావాన్ని ప్రకటిస్తే.. అమ్మ దీవెన నూరేళ్ళ పంట అంటూ **సముద్రాల శ్రీదేవి** రాస్తే.. తల్లి యొక్క ప్రాశస్త్యాన్ని తెలియజెబుతూ **కళ్యాణం శ్రీనివాస్** రాస్తే.. అమ్మ ప్రేమను జారవిడుచుకోకండి అంటూ డి.ఎస్. సైరాభాను హితవు పలికారు.అమ్మ నాన్నలను **కూచ మల్లయ్య** ఆరాధ్య దేవతలుగా భావిస్తే.. **డా॥ వి. రఘుపతి** అమ్మను అనురాగ దేవతగా ఆవిష్కరించారు. 'అమృత వల్లీ అమ్మ" అంటూ **విజయలక్ష్మి వెంకటేశ** ఓ గేయాన్ని రాస్తే.. అమ్మ నాన్నల ఆత్మీయతానురాగాలను **వెంకటకృష్ణ** ప్రగడ అక్షరాల్లో బంధించారు. అమ్మ నాన్నలతో వున్న అనుబంధాన్ని **చౌటపల్లి నీరాజచంద్రన్** నెమరు వేసుకున్నారు. **వి.వి.వి. కామేశ్వరి** రాసిన 'అన్వేషణ అమ్మా నాన్నల కోసం" ఆర్ద్రంగా ఉంది. నాన్న తాను ముళ్ళబాటలో నడుస్తూ నన్ను పూలబాటలో నడిపించావంటూ శివేగారి **చిన్నికృష్ణ** గుర్తు చేసుకున్నారు. అమ్మపేరే శాశ్వతమని **సదాశివుని లక్ష్మణరావు** అంటే.. అమ్మనాన్నలు దేవుడిచ్చిన వరాలు అంటూ **రాజా రావు దొండపాటి** తమ కవితను కొనసాగించారు. అమ్మకన్న మిన్న అవని యందెవరన్న? అంటూ **డి.ఎస్.వి. రామశర్మ** ప్రశ్నించారు. అనాథలవుతున్న అమ్మనాన్నల పట్ల **బత్తులూరి నాగబ్రహ్మాచారి** తమ వేదనను వ్యక్తపరిచారు. ప్రేమకు ప్రతిరూపం అమ్మ అని **బుర్రి కుమార్‌రాజు** అంటే.. కనిపించే ప్రేమ అమ్మయితే.. కనిపించని ప్రేమ నాన్న అని **రజని కులకర్ణి** తేల్చి చెప్పారు. సృష్టిలో అమ్మానాన్నల ప్రేమకన్నా ఏముందని **భోగెల ఉమా మహేశ్వరరావు** రావు ప్రశ్నించారు. కళ్లలో పెట్టుకుని పసిపాపలా చూసుకుంటా నాన్న తిరిగొస్తావా అంటూ **చోడవరపు వెంకటలక్ష్మి** అర్థించారు. కోయిలకొండ రాములు అమ్మను దేవతగా వర్ణిస్తూ ఓ గేయాన్ని రాశారు. మల్లారపు రాజు నాన్నతో వున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుంటే.. **కుదమ తిరుమలరావు** తల్లిదండ్రుల త్యాగాలను నెమరు వేసుకున్నారు. అమ్మనాన్నలే మాకు ఆదర్శనీయులు, మార్గదర్శకులు అని **డా॥ ఎన్. విజయభాస్కర్** అంటే.. కనిపెంచిన వారుకానివారై పోవడం పట్ల **జి.ఎల్.ఎన్.శాస్త్రి** తమ వేదనను ప్రకటించారు. **నల్లా నరసింహ మూర్తి** అమ్మను అనురాగ దేవతగా ఆవిష్కరిస్తే.. అమ్మ ఆలోచనం.. నాన్న దిగ్దర్శనం అంటూ **డా॥ పొందాల మహేశ్వర్** తమ కవితను కొనసాగించారు. అమ్మనాన్నల ప్రేమను దుప్పటి మొగిలి ఆవిష్కరించారు. ఈ సంకలనానికి సంపా దకత్వం వహించిన డా॥ వైరాగ్యం ప్రభాకర్ అమ్మను అనుక్షణం ఆరాధిస్తాను.. అసలే మరువను అంటూ తమ అమ్మపై ఉన్న మమకారాన్ని చాటి చెప్పారు. చక్కని ముఖచిత్రంతో ముస్తాబై వచ్చిన ఈ గ్రంథంలోని కవితలు అమ్మ నాన్నల ఔన్నత్యాన్ని చాటి చెప్పాయి. అమ్మనాన్నల పట్ల వ్యవహరించాల్సిన తీరు తెన్నులను తెలియజేశాయి. చాలా కవితల్లో కవిత్వాంశ పెద్దగా లేక పోయినప్పటికీ.. తల్లిదండ్రుల పట్ల ఆయా కవులకున్న గౌరవభావాన్ని అభినందించి తీరుతాం. ఈ సంకలనంలో భాగస్వాములైన కవులు, కవయిత్రులు తమ రచనా వ్యాసంగాన్ని ఇంతటితో ఆపకుండా.. మరింత గాఢమైన కవి త్వాన్ని అందించాలని కోరుకుందాం. సంపాద కులు డా॥ వైరాగ్యం ప్రభాకర్‌కు అభినందనలు తెలుపుదాం.

ప్రతులకు: వైరాగ్యం ప్రభాకర్
ఇ.నెం. 2-102,
సీతారాంపూర్
కరీంనగర్-505 002
9014559059



-దాస్యం సేనాధిపతి
94405 25544



### సమతారాగం

కాశ్మీరం నుండి
కన్యా కుమారి దాకా
దేశం ఒక్కటన్నప్పుడు
దేశానికంతటికీ
ఒకే రాజ్యాంగం
ఉండాలన్నది
సమంజసమే.

హిమాచలం నుండి
వింధ్యాచలం దాకా
భారతమంతా
ఒక్కటన్నప్పుడు
భారతీయులందరికీ
ఒకే న్యాయం.
ఉండాలన్నది
ఉచిత నిర్ణయమే.

జీలం నది నుండి
క్రిష్ణానది దాకా
భారత క్షేత్రమే
అన్నప్పుడు
భారతీయులందరికీ
ఒకే ధర్మం
ఉండాలన్నది
ఒప్పుకోవలసిందే.
ఇక ప్రత్యేక అధికరణాలూ వద్దు
ప్రత్యేక అధికారాలూ వద్దు
దేశమంతా ఒకే గృహం
దేశీలయులమంతా ఒకే కుటుంబం.

కాశ్మీరం నాది
తెలంగాణం నీది
గంగానది నాది
గోదావరి నీది
శ్రీనగరం నాది
భాగ్యనగరం నీది
నీ పెదవులపై నవ్వు
నా నవ్వై
నీలోని వేదన
నా వేదన
నీ కన్నీరు నేను తుడుస్తాను
నా కష్టాల్లో నీవు పాలుపంచుకుంటావు
ఇక నీవూ నేనూ లేదు
మనం

మనది అఖండ భారతం
మనమంతా భారతీయులం
'హిందూ సితా హమారా
జండా ఊంఛా రహే హమారా.



- డా॥ తిరునగరి
93924 65475

# బాల వికాసం

**నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల తడపాకల్ జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు రాసిన కవితలు ఈవారం నేటినిజం పాఠకుల కోసం**

-సంపాదకులు

## చెట్టు

దేశం అభివృద్ధి కావడానికి
ముఖ్య కారణం చెట్లు
తినడానికి ఫలాలని ఇచ్చేవి చెట్లు
ప్రాణ వాయువును ఇచ్చేవి చెట్లు
వర్షం పడడానికి ముఖ్య కారణం చెట్లు
వరదలు రాకుండా చేసేవి చెట్లు
అందుకే చెట్లను పెంచుదాం
ఆనందంగా జీవిద్దాం.
చల్లని గాలినిచ్చేవి చెట్లు
నీరు నిచ్చేవి చెట్లు
పండ్లనిచ్చి ఆరోగ్యాన్ని ఇచ్చేవి చెట్లు.
మందులు తయారు చేయడానికి
ఉపయోగం చెట్లు
వంట సరుకులకు ఉపయోగం చెట్లు
మన పల్లెటూరుకు అందం చెట్లు
ప్రకృతిని కాపాడటానికి ముఖ్యకారణం చెట్లు
మన దేశంలో సంస్కృతి మిగిలి ఉందంటే
దానికి నిదర్శనం చెట్లు.
స్వచ్ఛమైన ఆహారాన్నిచ్చేవి చెట్లు
పచ్చదనాన్ని ఇచ్చేవి చెట్లు
మన ప్రగతికి మూలం చెట్లు
మన భవితకు అందం చెట్లు.
చెట్లను పెంచుదాం
మన సంస్కృతిని కాపాడుదాం
మన దేశ గౌరవాన్ని నిలబెడుదాం
భరతమాత ఆశయాన్ని సాదిద్దాం.

## మా ఊరి సర్కారు బడి

ప్రైవేటు బడి వద్దు
సర్కారు బడి ముద్దు
పైసల చదువు వేస్టు
ఆడే పాడే సర్కారు బడి బెస్టు
స్వాతంత్ర్యంరోజు ఆడి పాడేది సర్కారు బడి
వీరుల జయంతిని వినయంగా జరిపేది
సర్కారు బడి
పిల్లలను మాటల్లో కాదు
చేతల్లో చూపేది సర్కారు బడి
అదే అదే
మా ఊరి సర్కారు బడి
పైసల ప్రైవేట్ వద్దు
సంతోషాల సర్కారు ముద్దు



**- డి. రోషిణి**
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్.
తడపాకల్

## స్నేహ బంధం

స్నేహ బంధము
ఎంత మధురము
చెరిగిపోదు జీవితాంతము
ఆటకు పాటకు నిలువురూపం స్నేహ బంధము
అది ఉంటుంది కలకాలము
ప్రేమ చూపేదే స్నేహము
బాధ పంచుకునేదే స్నేహము
ఇద్దర్ని కలిపేదే స్నేహ బంధము
ఒక ఆత్మ రెండు శరీరాలను
కలుపుకున్నదే స్నేహ బంధము
ఏదో శక్తి కూడుకున్నదే స్నేహం
అది ఉంటుంది కలకాలము
చెరిగిపోదు జీవితాంతము.



**- సయ్యద్ అరీఫ్**
8వ తరగతి
జడ్.పిహెచ్.ఎస్. తడపాకల్

## రైతు మెతుకు బతుకు

నేలకందని వాన
చేతికందని పంట
కదుపుకందని కూడు
ఊహకందని బాధ
ఉరితాడే పసుపు తాడయ్యింది
పురుగుల మందే పానకమయ్యింది
అప్పులే ఆస్తులయ్యాయి
బరువెక్కిన మనసుల నుదుట
బాసికాలయ్యాయి
బక్క చిక్కిన పశువులే
ఆత్మబంధువులయ్యాయి
జీవం లేని తన శరీరమే
అగ్నిగుండంలో కట్టెలయ్యింది
నకిలి విత్తనాలే తలలో తలంబ్రాలయ్యాయి
నేలమ్మ గొంతు తడపని వాన
తులసి నీళ్లై తన గొంతును తడపంది
వానలేక ఎండిన పొలం
తన శవానికి పూలపాన్పయ్యింది
గొడ్రాలైన నేల కడుపును
రైతు తన శవాలతో పండించాడు.

**- యన్. అక్షిత్**
10వ తరగతి
ఏర్గట్ల, నిజామాబాద్



## వాన పడిన రోజు

ఈ రోజు వానపడిన రోజు
నాకు ఎంతో సంతోషంగా వుంది
వానపడిన రోజే
ఆకాశంలో ఇంద్రధనస్సు చూడడానికి
రెండు కళ్ళు సరిపోవు
పక్షులు కిలకిల రాగాలతో పాడుతున్నాయి
జంతువుల చిలిపి
గంతులతో చిందులు వేస్తున్నాయి
రైతు హలంపట్టి పొలం దున్నుతుంటే
ఆ పుడమితల్లి ఎంతో సంతోషంగా వుంది
వేడిని పోగొట్టి చల్లదనాన్ని మాకు అందిస్తుంది
పచ్చని చెట్ల ఆకులతో మా ప్రకృతి
పరవశింపజేస్తున్నది
పిల్లలు పడవలు చేస్తు
కాలువలో వదులుతున్నారు
పచ్చని చెట్లతో రంగు రంగుల పూలతో
ప్రకృతి పులకరిస్తుంది
మట్టివాసన మా హృదయాన్ని తాకుతుంది
ఆహా!
చూడడానికి ఎంతో బాగుంది
వాన పడి మాకు ప్రాణం పోసింది
వాన ఇంతలో మాకు
బాయ్ బాయ్ చెప్పి వెళ్ళింది.



**-ఎ. వైష్ణవి**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్

## స్నేహం

భాష లేనిది బంధం ఉన్నది
సృష్టిలో అది మధురమైనది
జీవితంలో మనిషి మరువలేనిది
ఆపదలో అవసరాన్ని
బాధలో మనసుని
తెలుసుకొని సహాయపడేవారే
నిజమైన స్నేహితులు
నేస్తమా అని పలకరించే హృదయం నీకుంటే
నీ స్నేహానికి చిరుకాలం నేను తోడుంటానేస్తమా!
ఆరిపోతే తెలుస్తుంది దీపం విలువ
వీడిపోతే తెలుస్తుంది
మన స్నేహం విలువ.



**- యన్. శివాణి**
8వ తరగతి
జడ్.పిహెచ్.ఎస్. తడపాకల్

## స్నేహ బంధము

స్నేహం దొరకడం అదృష్టం
నిజమైన స్నేహం దొరకడం చాలా కష్టం
స్నేహానికి కావల్సింది ఒకరిపై ఒకరికి నమ్మకం
అప్పుడు ఆ స్నేహం ఉంటుంది కలకాలం
స్నేహం మన జీవితాన్ని మార్చునోయి
స్నేహం జీవితాంతం ఉండడం వరమునోయి
స్నేహం చాలా విలువైనది
నిజమైన స్నేహం ఉండడం మనకు మంచిది
స్నేహం అంటే మారుపేరు
కుచేలుడు కృష్ణుడునోయి
వీరిలాగ మనం ఉండాలినోయి
స్నేహం జీవితంలో ఒక అర్థం
స్నేహం లేనివారి జీవితం వ్యర్థం
మంచి స్నేహితురాలు ఎంచుకోవడం ఉత్తమం
స్నేహం వాడిపోని అరవిందం
స్నేహం అరిగిపోని శ్రీగంధం
స్నేహం అంతమవని మకరంధం.



**- సమిన**
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్



## రైతు గొప్పతనం

మనకు అన్నం పెట్టె రైతు
ఎంతో గొప్పవాడు
తాను తన ఆకలిని చూసుకోడు
ఎల్లప్పుడు ప్రజలే నా జీవితం అంటాడు
తాను ఎంతో కష్టపడుతాడు
తను భార్య అనక పిల్లలు అనక
ఎంతో కష్టపడుతాడు
తన జీవితంలో ప్రజలే నా పక్షంఅంటు
ప్రజల కోసం ఎల్లప్పుడు కష్టపడుతాడు
తాను ఎండనక వాననక కష్టపడతాడు
అందుకే మన మందరం
రైతే మన లక్ష్యం అని అనుకోవాలి
అందరి ఆకలి తీర్చేవాడే రైతు
రైతుని మనం ప్రాణానికి ప్రాణమైన
ఒక అన్నలా ఒక తమ్ముడిలా చూసుకోవాలి
ఒక్క రోజు మనకు అన్నం లేకపోతే
ఎంత తల్లడిల్లుతాము
రైతే మనకు రక్ష
రైతే మనకు దీవెన
రైతే మన దేశానికి వెన్నముక



**- జి.అనూష**
9వ తరగతి
జడ్.పిహెచ్.ఎస్. తడపాకల్

## చెట్టు

అవును చెట్టు అంటే ఎవరికీ ఇష్టముండదు
చెట్టు బతికినన్నినాళ్ళు మనకు
పండ్లు పువ్వులు ఇస్తుంది
చెట్టు చచ్చిన తరువాత కూడా
కట్టే రూపంలో మన ఇంటికి వచ్చి
మన ఆకలి తీరుస్తుంది
నల్లని కాండముతో పచ్చని కొమ్మతో
విలవిలలాడుతుంది చెట్టు
చెట్టు అమ్మ
వారి చేతిలోకి రెమ్మగా వెళ్ళి
అమ్మవారిని ఆటాడిస్తుంది
గుట్టకు అందం చెట్టు
చెట్టుకు అందం పువ్వు
చెట్టు ఉంటేనే పశువు, పక్షులకు ఆనందం
చెట్టు జీవులకు గూడవుతుంది
మనకు తోడవుతుంది
పల్లెటూరి ఆనందాలు చూసేదే చెట్టు
పల్లేటూరికి అందం ఇచ్చేదే చెట్టు
మొక్కలు నాటండి
వర్షం కురిపించండి.



**- డి. కృష్ణవేణి**
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్

## మా ఊరు

అమ్మలాంటి మా ఊరు
అందరికీ ఆధారం మా ఊరు
అందాల కోవెల మా ఊరు
నిండా మంచితనం మా ఊరు
ప్రకృతితో నిండిన మా ఊరు
సంస్కృతి సంప్రదాయాలకు
నిలయం మా ఊరు
ఆకుపచ్చ చీరకట్టుకున్న మా ఊరు
అందరూ ఐక్యమత్యంగా ఉండే మా ఊరు
అందుకే మా ఊరంటే నాకు ప్యారు
ఆనందాల హరివిల్లు మా ఊరు
నెమలి నాట్యపు సోయగము మా ఊరు
పూలరాశుల ఆనందాలు మా ఊరు

**- ఎ. అక్షయ**
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్

## స్నేహం కన్నా...

స్నేహం కన్నా గొప్పది లేదు
స్నేహం కన్నా మధురం లేదు
స్నేహమేరా ఈ జీవితం
స్నేహానికి నేనంకితం
స్నేహమే వెలుగై ఉండగా
స్నేహమే జీవమై
స్నేహమే ప్రాణమై
నాలో రగిలే స్నేహ బంధమా
స్నేహమే భావమనీ
స్నేహమే జీవమనీ
స్నేహాన్నీ మించి జగతి
వేరేదీ లేదనీ
స్నేహమే నీడగా నీతోడై ఉండగా
స్నేహమే రాగమై నా మనసున నిండగా
నాలో జీవించే స్నేహమే
నీలో శ్వాసించనీ..



**- ఎం. సునిత**
8వ తరగతి
జడ్.పిహెచ్.ఎస్. తడపాకల్

## రైతు గొప్పతనం

రైతు గొప్పతనం
మరువలేని తీయదనం
తాను కష్టాల్లో మునుగుతూ
ప్రజల్లో ఆనందాన్ని నింపుతున్నాడు
ఆకలి బాధ తెలియకుండా చేస్తున్నాడు
తాను ఎంత ఆకలి బాధలో ఉన్నా
పంటలను చూస్తూ
ఆకలి బాధను మరిచిపోతున్నాడు
తాను ఎండలో ఉంటూ
మనకు చెట్టులా నీడనిస్తున్నాడు
తొలకరి నీరు కోసం ఎదురుచూస్తూ రైతన్న
తన వాళ్ళని కూడ మరిచిపోతున్నాడు
మన అందరి అన్నలా ఉండే
అన్నదాత రైతన్న.



**- ఎం. గంగాదేవి**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్

## స్నేహబంధం

నీ అందం అపురూపం స్నేహం
నీ చూపు సౌందర్యం స్నేహం
నీ నవ్వు నవరసం స్నేహం
నీ స్వరం స్వర్ణమాధుర్యం స్నేహం
నీ నడుమున మాగరం స్నేహం
నీ నడక మనోహరం స్నేహం
నువ్వే ఇక నా సర్వం స్నేహం
నీతోనే స్వయంవరం స్నేహం
నా ఆశకు శ్వాసకు నీ స్నేహం.



**- ఎ. అక్షయ**
8వ తరగతి

## స్నేహ బంధం

జీవితానికి తోడు ధైర్యం
మనస్సుకు తోడు నమ్మకం
నాకు తోడు మన స్నేహ బంధం
ఉదయించిన సూర్యుడు అస్తమిస్తాడు
విరిసిన వెన్నెల చీకటౌతుంది
వికసించిన పువ్వు వాడిపోతుంది
కాని స్నేహ బంధం కలకాలం వరకు
నిలిచిపోతుంది.
జీవితానికి తోడు ఉండే ధైర్యం
స్నేహ బంధం.

**- ఎం. సునీత**
8వ తరగతి,జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్

## వాన పడిన రోజు

నేలపై వాన చుక్క లేక
రైతు కళ్ళలో కన్నీరు
వాన పడిన రోజు
రైతు కళ్ళలో కన్నీరు తొలగి
నవ్వుల హరివిల్లు
వాన పడిన రోజు పక్షుల కిలకిలలు
ప్రకృతి హొయలు
పచ్చని ప్రకృతిలో పక్షుల మధ్య
అందాల పల్లె సీమ
వాగులు పారుతాయి
పంటలు పండుతాయి
మనసుకు ఆనందాన్ని ఇస్తాయి
ఆ రోజు రైతు హలం పట్టి
పొలం దున్నుతాడు.

**- యల్. కీర్తన**
9వ తరగతి
జడ్.పిహెచ్.ఎస్. తడపాకల్



# తిరుగులేని బాలల బాండాగారం తీరొక్క పూలు

బాల్యం అమూల్యమైనది. గడిచిపోయిన బాల్యాన్ని తిరిగి సంపాదించుకోవటం చాలా కష్టం. మధుర స్మృతులుగానే స్మరణ చేసుకోవాల్సి వస్తుంది. మనము చిన్ననాటి ఆట పాటలను గుర్తుచేసుకుని ఆనందడోలికల్లో తేలియాడుతాము. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు చిన్నప్పుడే ఆడుతూ పాడుతూ సామాజిక చైతన్యం వైపు అడుగులు వేస్తూ సాహిత్య రచనలు చేస్తున్న బాలలు అదృష్టవంతులు. అలాంటి బాలలే నేడు నవభారత నిర్మాణంలో చైతన్య దీపికలై ముందు నిలుస్తారు.

గత మాసంలో నామాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నర్సింలు తెలుగు ఉపాధ్యాయులు రావిరాల బసవయ్య సంపాదకత్వంలో **తీరొక్క పూలు** బడి పిల్లల కవితాసంకలనం ఆవిష్కరించ బడింది. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడ కలిసి ఉన్నట్లుగా ఎన్నో రకాల పువ్వులను ఒక దగ్గర పేర్చి తీరొక్క పూలు పుస్తకంగా బతుకమ్మలా పేర్చారు. ఈనాడు రచనలు చేయడం వేరు చేసిన రచనలను పుస్తక రూపంలో తీసుకురావడానికి చాలా కష్టతరం. ముఖ్యంగా ఆర్థికంగా ఖర్చుపెట్టి పుస్తకం తీసుకొస్తే ఏం లాభం అనుకున్న తరుణంలో బాలల కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న ముస్తాబాద్ పీపుల్స్ హాస్పిటల్ చింతోజు బ్రదర్స్ బాల కవుల కోసం చేసే సేవలు అమోఘం.




ఇక తీరొక్క పూలు బడి పిల్లల కవితా సంకలనం గూర్చి చెప్పుకుందాం. నేడు తెలంగాణ రాష్ట్రంలో బాల సాహిత్యం విరివిగా రచనలు వస్తున్నాయి. నేను బాల సాహిత్య రచయిత అని చెప్పుకోవడానికి గర్వపడుతున్న తరుణమిది. అందులో ప్రతి పాఠశాలలో కూడా బాల కవులు పుట్టుకొచ్చి వందకుపైగా పుస్తక సంకలనాలు బడి పిల్లలు రచనలతో రావడం విశేషం అందులో నామాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థుల తీరొక్క పూలు అద్భుతమైన బాల కావ్యం. తీరొక్క పూలులో అరవై మూడు కవిత పూలు ముచ్చట గొలుపుతున్నాయి.

తొమ్మిదో తరగతి విద్యార్థి ప్రత్యూష దీపావళి కవితలో...

**ఆకాశంలో ఉన్న చుక్కలు అన్ని**
**వాకిట్లో వాలినట్టున్నాయి**
**దీపాల వెలుగుల్లో**
**ఇల్లంతా ఆనందంగా ఉంది...** అంటూ దీపావళి పండుగ గురించి చక్కగా రాసారు.

పదవ తరగతి విద్యార్థి అభినేశ్వర్ చెరువు కవితలో

**మా ఊరికి అందం చెరువు**
**చెరువుంటే రాదు కరువు**
**కరువుంటే రైతు గుండె బరువు**
**చెరువు ఉంటే నిండుతుంది రైతు కడుపు.....**

అంటూ విద్యార్థి రైతు గోసను గూర్చి చక్కగా వర్ణించాడు.

పర్యావరణం కవితలో శ్రీజ
స్వచ్ఛమైన కార్యక్రమం- ఓ లచ్చగుమ్మడి
అదే మన స్వచ్ఛ భారత్ -ఓ లచ్చగుమ్మడి
చెత్త కుండీలు వాడదాం-ఓ లచ్చగుమ్మడి...

అంటూ మన పరిసరాలు ఏవిధంగా ఉండాలో చక్కని పాటను అందించింది

**అమరన్ పాషా రచించిన ఓటు కవితలో**
**విలువ ఇవ్వు ఓటుకి**
**ఆశపడకు నోటుకి**
**దొంగ ఓటు తప్పు ముమ్మాటికి..,**అంటూ ఓటు విలువను తెలిపాడు

ఇలా 63 కవితలలో ప్రతి ఒక్కటి ఆణిముత్యమే. నామాపూర్ ఆదర్శ పాఠశాల బాల కవుల రచనలు తెలుగు భాష కళామతల్లికి కంఠాభరణాలు అవుతాయని భవిష్యత్తులో ఏ రంగంలో నిలిచిన రచనలు చేసిన ప్రతి విద్యార్థి ఉన్నతులుగా సామాజిక శ్రేయస్సు కోసం పాటుపడతారని ఆశిస్తున్నాను.



**-ఉంద్రాల రాజేశం**
9966946084

**నేటినిజం చందా వివరాలు**
ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.
'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్టి-74,
జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.

## ప్రియ భార్యా...

ప్రేమ పరిమళం నింపుకొని
నా కోసం పూసిన పెండ్లి చెట్టు పువ్వువు,
ఎండలానో వెన్నెలలానో నిన్ను లాలిస్తుండాలి కాని
నేను అసహనం నిప్పులు చిమ్మట మేంటి!

నా కంచంలో అన్నం ముద్దవు,
నా మంచంలో వెన్నెల ముద్దవు,
దేవుళ్ళు నా కిచ్చిన దేవతగా నిన్ను పూజించాలి కాని
నేను అవమానాల దుమ్ము చల్లట మేంటి!

ఎత్తు పల్లాల దారుల్లో నేను కంగారుపడుతున్నప్పుడు
పట్టుకొని నిలబెట్టే చెయ్యిని నిన్ను కాపాడుకోవాలి కాని
నేను వంకర మాటలతో విరగ్గొట్టట మేంటి!

ప్రశాంత మైన నిద్రలో ఆనందప్రద మైన కల నీవు,
చీకటిలో మునిగిపోతున్న నన్ను ఒడ్డుకు చేర్చే అద్భుతమైన మహా కళ నీవు...
మనసులో మనసు పెట్టి నడిపించే నిన్ను నిలుపుకోవాలి కాని
నా ఆధిక్య భావ పాషాణాలు దొర్లించట మేంటి!

ఓ నా దివ్య పరిమళ భరిత పుష్ప వనమా!
ఓ నా అనంత స్వర్ణ నిధానమా!
కుటుంబంలో నేనేదో ఎత్తుగా కనిపిస్తున్నాను కాని
నీ అదృశ్య మహిత విశ్వరూపం ముందు
నేనెప్పుడూ నలుగురికీ కనిపించని ఒక మరుగుజ్జునే,
నిజం చెప్పా లంటే
వామనుడిలా వెలుగుతున్న హరివి నీవు,
మానవుడిలా బతుకుతున్న భక్తుడ నేను.

నీ కన్నా పది రోజులన్నా ఎక్కువ బతకాలని కోరుకుంటా
నెందుకో తెలుసా!
నీ మలి సంధ్యలో నీ కవసరమయితే
నిన్ను సేవించుకొనే అదృష్టం నాకు దక్కాలని!



**-డా. రావి రంగారావు**
9247581825

## గ్రీన్ పోయె"ట్రీ"

నా పద్యం
పచ్చగా పదికాలాలపాటు పదిలంగా ఉండాలంటే
చెట్టును గాడాలింగనం చేసుకోవలసిందే

నా పద్యం
భావితరాల బాగును కోరి అయితే
చెట్టును నాటండి ఉద్బోధించాల్సిందే

నా పద్యం
త్యాగాల రాగాలు ఆలపించాలంటే
చెట్టును కీర్తించి తీరాల్సిందే

నా పద్యం
మనిషిలో ఆత్మవిశ్వాసం ప్రోది చేయాలంటే
చెట్టును ఉపమానంగా చూపాల్సిందే

నా పద్యం
అమ్మతనాన్ని జగమంతా వ్యాపింప చేయాలంటే
చెట్టు ఔన్నత్యాన్ని శ్లాఘించాల్సిందే

నా పద్యం
పదుగురి మేలును కోరేదైతే
చెట్టు సేవా గుణాన్ని స్తుతించాల్సిందే

నా పద్యం
ప్రపంచాన్ని ఆనందపు డోలికల్లో ఊగించాలంటే
పచ్చని చెట్టును గురించి
పరవశంతో పాడాల్సిందే



**-సాగర్ల సత్తయ్య**
7989117415

## నిజాలు!

దాంపత్యపు నిత్యత్వం
వీడని ముడులు., తడబడనియడుగులు.
రెండు మార్గాలు సమస్యేదైనా
ఐతే ఎదిరించడం లేదా భరించడం.
ప్రాణదాతలే మృత్యుదూతలు
ప్రాణవాయువూ నోచలేని దుర్వ్యవస్థలో.
ఒక నేస్తం కావాలి
పంచుకోడానికి, మోదమైనా..ఖేదమైనా.
ముమ్వన్నెల బావుటా
సప్తవర్ణాలు నింపాలి.,బ్రతుకులన్నిటా.
మనిషి జీవశ్చవమే
మనసు వికలమై,బ్రతుకు శకలమై.
యోధానుయోధులు
ఐతేనేం ఆకలి ముందు అర్భకులే.
కవి కళ్ళు ఎక్సరేలు
కలం కలల్లో ఫోటోషాప్‌లు.
కోరికలే నెరవేరునులే
కాలం వల్లకానివి కల(నీ)తీరుస్తూ.
అన్నుల మిన్న కన్నులే
పెన్నులై భాషిస్తూ, గన్నులై పేల్చేస్తూ.
నిత్య వర్ష ఋతువు
నా కనుకొలుకుల్లో, చిలికే చినుకుల్తో.
కౌగితం పూలెన్నో
సౌకుమార్యం, సౌరభం కొఱవడుతూ.



**-గొల్లపెల్లి రాంకిషన్**
9849693324.

పుస్తక సమీక్షలు

# ఆధ్యాత్మికం ఈ సువర్ణం




రాను రాను నవలలు కనుమరుగవుతున్న ఇటీవల తరుణంలో సువర్ణభరితమైన ఇలాంటి నవలలు రావడం అపురూపం. వాస్తవ ఇతివృత్తంతో సాగిన ఈ నవల చదవడానికి ఎంతో సరళంగా ఉంది. వస్తువు ప్రతి ఒక్కరికీ చాలా దగ్గరగా ఉంది. చదువుతున్నంతసేపూ ఈ జీవితాలన్నీ మనతోనే ఉన్నాయా అనే అనుభూతిని కలిగిస్తున్నాయి. మనిషి నిత్యం ఆశల యానం చేస్తుంటాడు. ఒకటి కావాలనుకున్నపుడు మారాం చేస్తాడు. దక్కాక మరొకటి కావాలంటాడు. అదీ సొంతమయ్యాక మరొకటి కావాలంటాడు. ఇలా నిత్యం ఏదో ఒక ఆశతో పోరాటం చేస్తూనే ఉంటాడు. ఈ పోరాటంలో అనేక ఇబ్బందులు, అనేక అవమానాలు, అవహేళనలు ఎదురవుతూనే ఉంటాయి. కానీ మన జీవన ప్రయాణంలో మనకు తోడుగా దైవాన్ని తీసుకెళితే చాలు మనం నిత్యం ఆనందంగానే ఉంటాము అని తెలియజేయడమే ఈ నవల ఉద్దేశ్యం. ప్రతి ఇంట్లో సమస్యలుంటాయి.

ప్రతి ఇంట్లోనూ సందేహాలు, సమాధానాలే తెలియని ప్రశ్నలు అనేకం ఉంటాయి. వాటన్నింటికీ ఒకటే సమాధానం ఆధ్యాత్మికత. అంతే అంటారు ఈ రచయిత షణ్ముఖశ్రీ.

పూర్వీకులు పురాణాల్లో రాసినట్లు కొన్ని వేల యేండ్లు తపస్సు చేసిన ఋషులు సహితం ఒక స్త్రీ తపోభంగం చేయడం కారణంగానే తపోభంగం పొందారని విన్నాము ఈ కలియుగంలో. వీటికి తోడు వివిధ రకాల ఫ్యాషన్ల తయారీలు, అలవాట్లు కారణంగా ఏ పురుషుడు స్త్రీ లోలుడు కాకుండా ఉండగలడు? తను ఆ ఋష్యాదుల కన్నా అతీతుడా? ఎంతటి వాడైనా స్త్రీ వ్యామోహంలో పడకుండా ఉండగలడా? కామ, క్రోధాలలో దేనిని జయించగలడు? మరణించేవరకూ ఒక పురుషుడు తపస్సులోనో, తనదైన శైలిలోనో నిమగ్నమై ఉండగలడా? స్త్రీ అనేది ప్రకృతి ప్రతిరూపం. ప్రకృతికి పులకించని పురుషుడు ఉంటాడా? వాయువేగాన్ని మించి ప్రయాణించే మనసుని తన ఆధీనంలో ఉంచుకోగలడా? ఇవన్నీ జరిగే పనులేనా? అయితే తానూ ఒక సామాన్యుడిలా లేదా సంసారిలా మారి జీవితాన్ని అనుభవించి తనువు చాలించవలసినదేనా? ఇంతకు మించి వేరే గత్యంతరం లేదా? ఇల అలాంటపుడు మనిషికి, ఋషికి గల వ్యత్యాసం ఏమిటి? సృష్టి, స్థితి కారకుడైన ఆ పరమేశ్వరుని తత్వాన్ని తాను అర్థం చేసుకోలేడా? అతని జీవితం ఇక వ్యర్థమేనా? ఏ జన్మ పాపం ఆ జన్మలోనే అంతరించిపోతుందని అంటారే మరి ఏ తప్పూ చేయకుండా ఈ జన్మలో అనుభవించే ఆవేదనలకు నిష్కృతి ఏమిటి అనే అనేకమైన ప్రశ్నలు ఈ నవలలో మనకు కనిపిస్తాయి. అతి సాధారణమైన కుటుంబంలో జరిగే సంఘటనలకు దైవం తోడయి ఎలాంటి పరిష్కారం చూపాడో అని తెలిపే ఈ నవల ఆద్యంత రసవత్తరం. ఈ నవలలోని ప్రతి పాత్ర ఎంతో హుందాగా తీర్చిదిద్దడం చూస్తుంటే ఈ రచయిత కలానికి ఎంతటి నేర్పరితనం ఉందో అనిపించక మానదు. అభినందనలు.

ప్రతులకు: షణ్ముఖశ్రీ,
నెం: 39, న్యూ నల్లకుంట,
హైదరాబాదు: ఫోన్: 8897853339

-శైలజామిత్ర
9290900879

# చిరస్థాయిగా నిలిచిపోయే చరితగురుతులు

ఈ చరిత గురుతులు మహాత్ముల, మహనీయుల, అనేక మంది ప్రతిభావంతుల ఘనతను ప్రతిబింబించే తీరులో సాగింది. దేశభక్తి, చైతన్యం, స్ఫూర్తి, సామాజిక స్పృహను రేకెత్తించే ఈ కవితలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. ఇది ఒక ప్రయోగం కాదు ఒక ప్రతిష్టాత్మకమైన నినాదం. కవి అంటే అందరూ ఒకేలా ఆలోచిస్తారనడం తగదు. ఒక్కో కవీ ఒక్కో సంఘటన పట్ల ఒక్కో విధంగా స్పందిస్తాడు. ఆ వైవిధ్యం ఈ కవిలో కనిపించింది. వీరి కవితల్లో కనిపించాయి.

ఫలించిన తెలంగాణ ఉద్యమంలోని ప్రత్యేకతల్ని తెలిపే పద్యాలతో ప్రారంభమైన ఈ సంపుటి పోరుగడ్డ వీరులను, కళాకారులను, క్రీడాకారులను తదితర అనేకమంది ప్రముఖులను ప్రతిభావంతులుగా గుర్తించి వారి మూర్తిమత్వాతలను కళ్ళముందు నిలిపే ప్రయత్నం చేసిన గ్రంథం ఇది. ఇందులో అనేకం వచన కవిత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నా గేయ కవితా లక్షణాలను కూడా కలిగి ఉన్నాయి. దుర్గాప్రసాద్ గా స్వతహాగా గాయకుడు కావడంతో ఈ జమిలి లక్షణాన్ని నిబంధించారనే చెప్పాలి, ఇందులో ఒక్కో కవితా నాలుగు పాదాలుగా విభజించడం కొత్తగా ఉంది. నాలుగో పాదం మకుటంగా తెలియజేస్తారు. రాణీ రుద్రమ దేవి, దాశరధి సోదరులు, తెలంగాణ కవి పాల్కురికి, చందాల కేశవరావు, చాకలి ఐలమ్మ, షోయబుల్లాఖాన్,




వట్టికోట ఆళ్వారు స్వామి. సుద్దాల హనుమంతు, బుర్రకథా పితామహుడు నాజర్, దళిత దారిదీపం బాగ్యరెడ్డి వర్మ, ల గురించి విపులంగా వివరించడమే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన సురవరం లాంటివారి ద్వారా తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, కళాపత్రికా, రాజకీయ రంగ అతిరథ మహారధులను తన పద్యాల్లో ఆవిష్కరించడం విశేషం. ఈ గ్రంథం భావితరాలకు సైతం ఎంతో ఉపయుక్తమైనది.

వృత్తి రీత్యా ఉపాధ్యాయుడై అనేక జీవితాలను తరచి చూసి, రంగస్థల నటుడిగా, గేయ , కథా రచయితగా , కవిగా, సాహితీ విమర్శకునిగా, గాయకునిగా అనేక విజయాలను సాధించారని తెలుపుకున్నారు. వీటికి అనేక జాతీయ, రాష్ట్రస్థాయి, పురస్కారాలు సైతం అందుకున్నా రు. కానీ పిల్లలకు పాఠాలు బోధిస్తున్నపుడు , ముఖ్యంగా మహనీయుల చరిత్రలను బోధిస్తున్నపుడు పిల్లలలో కలిగే ఎనలేని ఆసక్తిని గమనించి చరిత్రలో అజేయమైన కీర్తిని సంపాదించుకున్న మహనీయుల జీవితాలకు అక్షరరూపాన్ని ఇచ్చి పిల్లల్లో మరింత స్ఫూర్తిని రగిలించాలనే ఆలోచనతో ఈ చరిత గురుతులు రచించానని తెలుపుకోవడం ద్వారా ఈ రచయితకు సమాజం పట్ల కలిగిన బాధ్యత ఎంత గొప్పదో అనిపించక మానదు. అడుగు ఒకటి పడటమే ఆలస్యం. అనేక అడుగులు తోడు వస్తాయనేది ఎంతో నిజం అని నమ్మి తాను అనుకున్న సత్కార్యానికి ఒక సజీవ రూపాన్ని అందించిన కవి సంపటం దుర్గా ప్రసాదరావు గారు నిజంగా ధన్యులు. చదివి గుర్తుంచుకో వలసిన గ్రంధాన్ని అందించిన వీరికి అభినందనలు.

ప్రతులకు: సంపటం దుర్గాప్రసాదరావు
ఫోన్: 84669 65401

-శైలజామిత్ర
9290900879

## వేదన

ఎడ్లబండి
బస్సు రైలు
నా ప్రయాణ సాధనాలు

ఊరూరా
ఓ కొండగుర్తు
మూలమలుపు
పాడుబడ్డ బావి
కొండో గట్టో గుట్టో
డొంకో చప్టానో
మర్రో రావియో కళ్ళకిసారా
ఊరి రాక
మనసు కేరింత
ఎడ్ల ఉరుకులు
పగ్గాలు వదిలించుకుని

బస్సు రైలు కిటికీల
వెంట పరిగిడే చెట్లు
స్తంభాలు
దూరంగా మదిలో
నాటుకుపోయిన
గుర్తు
దానికై వెదికే కళ్ళు
ఊరి పొలిమేరలో పులకింత

రోజులు దొర్లుతున్నాయి
సర్కార్ రోడ్లు ప్రైవేటు కి
నల్లగా నిగనిగలాడే
ఆనవాలన్నీ కబళింత
రయ్ రయ్ ఊర్లపై పడి
ఉన్న భూమి
రోడ్ కింద పాయె
విదిలించిన పరిహారం
పదిరోజుల్లో హాంఫట్

బతుకులు గతుకుల రోడ్లనాడే
కూసింత గతికి
సేదతీరిన గతం
యాదికొచ్చి
గాంద్రించి ఉమ్మేయాలన్పించింది



- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## సాగిపోతున్నా...

నిరాశ నిండిన హృదయంతో
కష్టాల కడలిలో
నిజాన్ని మరచి
నా ముందున్నదాన్ని కనలేక
చూడాలని వున్నా చూడలేక
జీవితం ఎటు పోతుందో తెలీక
సాగిపోతున్నా ఇలా

దారి తెన్ను లేని నావల
చుక్కాని లేని పడవల
తెరచాప లేక పోయినా
మరో మార్గం తెలీక
సాగిపోతున్నా నిలా

బంధాలను వదిలి అనంత విశ్వం లోకి
సాగిపోతున్నా ఇలా

నా అనే అహం వదిలి
నేను అనే శరీరం వదిలి
సాగిపోతున్నా నిలా

నన్ను భరించిన అవనిని వదిలి
ఊపిరి నింపిన గాలిని వదిలి
సాగి పోతున్నా ఇలా

అనంత విశ్వం పిలుస్తోంది
మరుజన్మ వుంటుందో లేదో
తెలీక పోయినా
సాగి పోతున్నా ఇలా



-పి.విశాలాక్షి
9908435805

## అల్పాక్షరాలు అనల్పభావాలు






నాలుగు కాలాలు నిలిచి నలుగురి నోట నాని, ప్రాచుర్యం పొందేది పద్యం. అందుకే కాబోలు సాహిత్య ప్రక్రియ పద్యంతో ప్రారంభమైనది అని అంటారు.

ఈ మధ్య పద్యం ఎన్నో మార్పులకు గురియైంది. ఛందోబంధనాలు. యతిప్రాస, గణ నియమాలు అతిక్రమించబడి కొద్దిపాటి నియమాలతో భావ ప్రాధాన్యమే ప్రధాన వస్తువుగా మారిపోయింది. హైకూలు, నానీలు, వ్యంజకాలు, రెక్కలు, ఏ పద్ధతిని గమనించినా, అభివ్యక్తికి పెద్దపీట వేయబడుతున్నది.

శ్రీయుత వడిచర్ల సత్యంగారు ఈ మధ్యే "మణిపూసలు" అన్న కవితా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నాలుగు పాదాలతో, 1,2 మరియు 4 పాదాలకు అంత్య ప్రాసతో, 3వ 4వ పాదాల్లో కవితా మెరుపుతో 10 నుండి 12 మాత్రల నియమంతో మణిపూసలు రాయబడుతున్నాయి.

ఇప్పటి వరకు 25 పుస్తకాలు వచ్చాయని తెలుస్తున్నది.

కవి ఎప్పుడూ తన రచనల్లో సమకాలీన సమాజాన్నే ప్రతిబింబింపచేయాలి. అప్పుడే ఆ కవితకు ఆదరణ వస్తుంది. ప్రాచుర్యం పెరుగుతుంది. "అక్షర ముత్యాలు" (మణిపూసలు) రచయిత బూరెం రాజు కూడా ఈ కిటుకును పట్టుకున్నారు. బాల్యం, సైనికుడు పర్యావరణం, కాళేశ్వరం ప్రాజెక్టులాంటి ప్రాచుర్యం గల వస్తువులపై తన దృష్టిని సారించి 112 మణిపూసల్ని అక్షర ముత్యాల దారంతో కలిపి ముత్యాల సరాలను మనకు అందిస్తున్నారు.

భావం శబ్దం రెండూ కవితకు మెదడు మరియు హృదయం వంటివి. ఈ రెంటి సమన్వయమే కవితా లక్షణాలని నిర్ణయిస్తుంది. శబ్దం భౌతికానందాన్నిస్తే భావం లౌకికేతర ఆనందాన్ని చేకూర్చుతుంది. పద విన్యాసం భావాభివ్యక్తి సమతూకం వల్ల పాఠకుడు మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటాడు.

ఈ కిటుకును మణిపూసలాంటి 'రాజు'కు అవగతం అయినట్లుంది. అందుకే అమరశిల్పి జక్కన గురించి రాస్తూ సకల కళా వైవిధ్యము శిల్పకళా నైపుణ్యము కలవాడు కనుకనే నిర్జీవపు రాళ్ళకు ప్రాణం పోసాడంటూ ప్రశంసిస్తాడు (పే.11). తెలంగాణా ప్రజల వర ప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి తన్నీరు హరీష్ రైతుల కంట కన్నీరు తుడిచి వారింట పన్నీరు చల్లాడని చమత్కరిస్తాడు (పే 23) పర్యావరణం గురించి ఏకంగా 8 మణిపూసల్ని రాసారు. అందరూ నిరసించినట్లే, ఈ కవి కూడా రాజకీయ నాయకులను ఓట్లడిగే భిక్షకులు అని ప్రజా సొమ్ముభక్షకులు అని ఈసడిస్తాడు (పే29).

ప్రతి 'పూస' లోనూ నీతి, హితబోధ చేస్తున్న ఈ 'వికారాబాదు వేమన' దాదాపు 400 కవితా (ఖండికలు) రాసాడట. వందాపన్నెండు మాత్రమే ఇప్పుడు మనకందిస్తున్న బూరెంరాజు మిగతా మూడు వందల కవితల్ని అందిస్తాడని ఆశిద్దాం. ఈ అక్షర సత్యాల్ని ఆస్వాదించే అవకాశానికి వేచియుందాం. మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం అన్నట్లు "అల్పాక్షరాలలో, అనల్పార్థ భావాలను చొప్పించగలిగిన రాజు నిజంగా రాజే! (కింగ్).

ప్రతులకు: బూరెం రాజు
వికారాబాద్
సెల్: 98490 74404



- కూర చిదంబరం
సెల్: 8639338675

## ఉద్యమ సెగ

విత్తు విత్తేదెవరు?
ఆ ఫలాల మెక్కేదెవరు?

చమట చుక్కలు రాల్చేదెవరు?
ఆ శ్రమ ఫలితం దోచేదెవరు ?

కట్టె అయి కాలేదెవరు?
ఆ చలి మంటల కాగేదెవరు?

యంత్రాల "రాపిడి"లో అరిగేదెవరు?
ఆ "రాబడి"తో సుసంపన్నమై ఎదిగేదెవరు?

శోకితులెవరు?
విలాసితులెవరు?

బలవంతుడి చేతిలో బలహీనుడు
'బలి" కావడమే కదా!
తరాల నాటి తరగని చరిత

అసమానతల "సెగ"లతో
రగులుతున్నదే కదా!
నేటి సామజిక వ్యవస్థ

కాలం కుదురుగ ఉండనట్లు
మనిషి జీవన "తీరు" ఒకే రీతిన
నిలువదన్నది నిజమెరిగిన "నిజం"

ఏదో ఒకరోజు
సామాజిక అంతరాల దొంతరల పూడ్చ
సాంఘీక దోపిడీల రాపిడిలు కాల్చ
అణిచివేతల్లోంచే "ఆయుధాలు" పుట్టుకొస్తాయ్

చమట చుక్కల్లోంచే
"నిప్పు" కణికలు జ్వలిస్తాయ్

మౌనం గొంతుకలోంచే
"రణ" నినాదాలు ప్రతిధ్వనిస్తాయ్

మరిగే రుధిరంలోంచే
"మర" పిరంగులు పేల్తాయ్

అప్పుడు ఎవరు అడ్డుపడ్డా...
ఆ ఉద్యమ "సెగ" కు మాడి
మసవక తప్పదు



– కోడిగూటి తిరుపతి
9573929493

## సంచార కైతికాలు

గంప నెత్తిన ఎత్తెనిక
బతుకున దారిలేక
పేరు గొప్ప తెలియక
పథకాల దరిచేరక
వారెవ్వా జీవుడా!
సంచారి సమరుడా.

పల్లె ఊసుల గమనంన
నెత్తిన గంపే మాకు
ఆధారమై వర్ధిల్లె
గొంతుతో సాగు మాకు

వ్యాపారం చతికిలపడి
ఉత్సాహమే కరువాయె!

ఆదివాసి బిడ్డలమే
మనుగడకై సమరమే
అవని ఎదపై అల్లిన
బంధాల తీగలమే
వారెవ్వా !ఆదిమ చరితం
నిత్యం అడవి బిడ్డలమే
మట్టి గాజు ఆధారం

మట్టే మాకానందం
పుడమి గర్భం నుండి
పుట్టిన ప్రేమానందం
వారెవ్వా !మట్టి బంధం
అడగడుగున అమితానందం.



-పగిడిపల్లి
సురేందర్ పూసల
8074846063

## నేనెవర్ని?

కళ్ళున్నాయి
మంచి చూపుల్లేవు!

చెవులున్నాయి
మంచి వినవు!

పెదవులున్నాయి
చిఱు నవ్వుల్లేవు!

చేతులున్నాయి..
మంచి చేతల్లేవు!

హృదయం వుంది
అందులో ప్రేమల్లేవు!

మనిషిగా వున్నా
కానీ విలువల్లేవు!

- ఎన్. రఘురామమూర్తి
9490796399




# "తెలుసుకొనుము నీవు తెలుగు వెలుగు"

## పెరుముల కైలాస్ శతకం






మాతృభాష పట్ల భక్తిని వ్యక్తీకరించే ప్రయత్నంలో భాగంగా పెరుముల కైలాస్, తెలుగు వెలుగు శతకం ఆటవెలదిలో 136 పద్యాలుగా రచించారు. ఆంగ్ల భాషపై వ్యామోహాన్ని వదిలి పెట్టాలని, పద్య రూపకంగా హెచ్చరించటమే కాకుండా తెలుగు మాధ్యమంలోనే చదవాలని అంటూ తెలుగు విద్యార్థులను మాతృభాష ఋణం తీసుకోవలసినదిగా కోరారు. ఈ శతకంలోని పద్యాలన్నీ లలిత మనోహర పద బంధాలతో తెలుగు భాషా మాధుర్యాన్ని గుబాళింప చేస్తున్నాయి. తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటి చెప్పిన కవి పంగవులందరినీ, పద్య రూపకంగా స్మరించటం కవికి తెలుగు సాహిత్యం, భాషపట్ల వున్న అనుబంధాన్ని, ప్రేమానురాగాలను స్పష్టం చేస్తోంది. 'తెలుసు కొనుము నీవు తెలుగు వెలుగు' పద్య నాల్గవ పంక్తిగా, ఈ శతకంలోని పద్యాలు అన్నీ, విద్యార్థులను ఉద్దేశించి వారి చేత హృదయాలలో తల్లిభాష పట్ల భక్తి బీజాలు నాటే సత్కృషిలో కవి కృతకృత్యులయ్యారు. నేటి కవులు వచన రచనలను ఆదరించినట్టు పద్య రచనలపై దృష్టి సారించకపోవటం వలన పద్యం అంతరించిపోతోందనే అపవాదును ఈ శతకం ద్వారా కైలాస్ తిప్పికొట్టారు. దైవభక్తి, మాతృ, పితృ, గురుభక్తితో తల్లిభాష పట్ల కూడా తొలి ప్రయత్నంలోనే యింతగా ఆరాధ్యనీయంగా శతక రచన వెలువరించిన యువ అధ్యాపక కవి పెరుముల కైలాస్ అభినందనీయులు.

**మాతృభాషకంటె మాధుర్యమది లేదు**
**తల్లిభాష కంటె ధనము లేదు**
**అమ్మ అనుటకంటె ఆనందమది లేదు**
**తెలుసుకొనుము నీవు తెలుగు వెలుగు**

అంటారు.

ప్రతులకు: పెరుముల కైలాస్
ఇ.నెం. 14–76
ఓల్డ్ యస్.సి. కాలనీ, భిక్కనూర్
సెల్: 8500609578



-జయసూర్య
సెల్: 9440664610

## కడారు మనోగీతికలు

చావుకు, పుట్టుకకు
సుముహూర్తాలు లేనప్పుడు
నడుమంత్రపు జీవితానికి
ఎందుకంట?

పండితుల సభలో వున్నావు
ప్రగల్భాలు ప్రదర్శించకు!
తాటి చెట్టు ఎక్కావు
భరతనాట్యంలో దిట్టననేది మరిచిపో!

చిందిస్తే చిరునవ్వులే
ఇకిలిస్తే వెకిలి నవ్వులే!
మంచైనా, చెడైనా
అంతా నోటి చలవే!

చీమంత వస్తువికి
ఏనుగంతవర్ణన!
కొండంతను గోరంత చిత్రించడం
కవిత్వానికున్న మహాత్మ్యం!

పెదాలు మెచ్చుకుంటుంటే
నొసలు వెక్కిరిస్తుంది!
అవును... నిజమే
మనిషి ద్విముఖీయుడు!

రేపనేది తెల్ల కాగితమే
ఒక్క గీత కూడా రాయనిది!
కానీ రేపు నేడైతే
అన్నీ గీతలే!

జీవితానికి మొదలు అమ్మ
జీవితాంతం తోడుండేది భార్య!
మధ్యలో వచ్చిన పిల్లలు
రెక్కలొచ్చి ఎగిరిపోయే పక్షులు!

ఏ అమ్మాయికైనా
'ఐ లవ్ యు!' చెప్పాలంటే
అనువైన ప్రదేశం దేవాలయమే!
కాళ్ళకు చెప్పులుండవు గనుక!

భ్రమరం వాలని పువ్వుకు
జన్మ వ్యర్థం!
గుచ్చి తేనె సేకరిస్తేనే
పువ్వుకి పురిటి నొప్పుల హాయి!

ఇద్దరి మధ్య ఏ సమస్యకైనా
న్యాయమైన ముగింపు 'సంధి'!
పరిష్కారం దొరికిందంటే
ఒకరు ఓడినట్టూ, ఒకరు గెలిచినట్టూ కాదు!



-కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

# సమాజాన్ని జాగృతం చేస్తున్న బిఎస్. రాములు

**-మంత్రి శ్రీనివాస్ గౌడ్**

సమాజంలో నాగరికత నేర్పిన చిన్ని వృత్తులు, జాతులను జాగృతం చేయటానికి బి.యస్.రాములు విశేష కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. విశాల సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతి లోని పైడి జయరాజ్ ప్రీవ్యూ థియేటర్‌లో ఈనెల 19న బి.సి. కమీషన్ ఛైర్మన్, సామాజిక తత్త్వవేత్త బి.యస్. రాములు 70 జన్మదినం (సప్తతి) సందర్భంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు తెలంగాణలో అభివృద్ధి జరుగుతున్నా కొందరు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని, వారిని తిప్పికొట్టడానికి రచయితలు, సాహితీవేత్తలు తమ కలాన్ని పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బి.సి. కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్ అధ్యక్షత జరిగిన సభలో టి.పి.ఎస్.సి. ఛైర్మన్ డా॥ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని ఉద్యమాల్లో బి.యస్. రాములు పాత్ర ఉందన్నారు. జ్ఞాన పిపాసి, తత్త్వవేత్త, బి.యస్. రాములు అని కొనియాడారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలంగాణ తొలితరం ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమం వరకు బి.యస్.రాములు పాత్ర గురించి విశ్లేషించారు. బి.యస్.రాములు సమాజానికి కొత్త ప్రాపంచిక దృక్పథాన్ని పరిచయం చేశారన్నారు. అస్తిత్వ ఉద్యమాలు ప్రబలుతున్న తరుణంలో ఆయన ఉద్యమాల్లో నిలబడ్డారన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని తన రచనల్లో రికార్డు చేశారన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు బాద్మి శివకుమార్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి, బి.సి. కమీషన్ సీనియర్ సభ్యులు వకుళాభరణం క్రిష్ణమోహన్, బొజ్జా విజయభారతి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలను ఘనంగా సత్కరించి విశాల సాహితీ బి.యస్. రాములు పురస్కారాలు అందించారు. రామా చంద్రమౌళి, అనిశెట్టి రజిత, గూడ అంజయ్య, చెమన్, జగన్నాథశర్మ, విహారి, బొజ్జా విజయభారతి తదితరులు పురస్కారాలు స్వీకరించారు.




*సభలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, వేదికపై డా॥ జూలూరి గౌరీశంకర్, అల్లం నారాయణ, డా॥ చక్రపాణి, బి.యస్.రాములు, డా॥ విజయభారతి తదితరులు.*

## బాలల ఒక తీయని పలకరింపు

రేపటి తరానికి వారసులైన నేటి చిన్నారి బాలలకు చదువుతో పాటు ఆటలు, సాహిత్యం కూడా అంతే అవసరం. ఆటలు శారీరక వికాసాన్ని పెంపొందిస్తే, సాహిత్యం వారిలో నిక్షిప్తమై ఉన్న సృజనాత్మక శక్తిని రాబట్టేందుకు దోహదపడుతుంది. సాహిత్యాభిరుచి గల పిల్లలు చదువులో కూడా ముందుంటారనేది జగద్విదితమే. బడి పిల్లలలో సృజనాత్మక కౌశలాలను వెలికితీయడానికి కొందరు ఉపాధ్యాయులు. బాల సాహితీవేత్తలు విద్యార్థులతో రచనలు వ్రాయిస్తూనే ఉన్నారు

దక్కన్ ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ గారు బాల సాహిత్య ప్రోత్సాహం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. పుస్తకాలను ముద్రించి బాలలకు అందిస్తున్నారు. త్వరలో ఆవిష్కరణ కానున్న "బాలచెలిమి " మాసపత్రిక కొరకు ప్రతి నెల రెండవ శనివారం రోజున బాల సాహిత్య సదస్సులు నిర్వహించి నూతనంగా పుస్తకాలు రూపొందించే వారికి చేయూత నందిస్తున్నారు. నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ గారు తమ పత్రిక సాహితీ కెరటాలు శీర్షిక లో బాలల రచనలకు సముచిత ప్రాధాన్యత నిచ్చి బాల సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. బాల సాహితీవేత్త డా. పత్తిపాక మోహన్ గారు వర్ధమాన బాల రచయితలకి సూచనలు ఇస్తూ, పుస్తక ముద్రణ లో సలహాలు అందిస్తూ ముందుకు నడుస్తున్నారు. ఇదే బాటలో పలువురు సాహితీ వేత్తలు. చాలా పత్రికలు బాల రచనలను ప్రోత్సహిస్తున్నారు.

2018 సంవత్సరములో హైదరాబాద్ లోని మంచి పుస్తకము అనే ప్రచురణ సంస్థ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ బాల సాహిత్య పరిషత్, పిల్లల లోకం, మానేరు రచయితల సంఘం తో కలిసి మంచి పుస్తకం వారు తెలంగాణ లో 6 నుండి 10వ తరగతి చదువుతున్న బడి పిల్లలకు కథా రచన పోటీ నిర్వహించింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా గణనీయమైన స్పందన వచ్చింది.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన 500కి పైగా కథలకు కోడింగ్ ఇచ్చి పారదర్శకంగా కథల ఎంపిక చేసినారు. వందలాది కథల నుండి 59 కథలను ఎంపిక చేసి ఒక పుస్తకం గా ప్రచురించారు. ఆ కథల సంకలనమే " తీయని పలకరింపు " తెలంగాణ బడి పిల్లల కథలు. కథల ఎంపికలో న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ బాల సాహితీవేత్తలు డా.యం. భూపాల్ ,డా.వి.ఆర్.శర్మ గార్లు సమర్థవంతంగా నిర్వహించారు. పిల్లలతో కథలు వ్రాయించి పంపడంలో గరిపల్లి అశోక్ లాంటి వారు చక్కని సహకారాన్ని అందించారు.

తీయని పలకరింపు పుస్తకం లో ప్రచురించిన 59 కథలు వ్రాసిన బాల కథారచయిత/రచయిత్రులకు మంచి పుస్తకం ప్రచురణ కర్తలు సురేష్, భాగ్యలక్ష్మి గార్లు పుస్తక ప్రతి,ప్రశంస పత్రంతో పాటు 500 రూపాయల నగదు చొప్పున బహుమతులను అందచేసి బాల సాహిత్యమునకు ఎనలేని సేవ చేశారు. 2019 మార్చ్ నెలలో ఈ పుస్తకము అవిష్కరించ బడినది.

ఈ పుస్తకం లో నిజామాబాద్ జిల్లా తడపాకల్ పాఠశాల వి ఏడు కథలు ,సిద్దిపేట జిల్లా జక్కాపూర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులవి ఆరు కథలున్నాయి. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మోడల్ స్కూల్ విద్యార్థి అభిషేఖర్ రెడ్డి వ్రాసిన తీయని పలకరింపు కథనే పుస్తకం పేరు గా నిర్ణయించడం బాలలకు ఇచ్చిన ప్రాధాన్యత గా చెప్పవచ్చు. ప్రచురణకర్తలు ఇచ్చిన స్ఫూర్తితో సిద్దిపేట జిల్లా జక్కాపూర్ పాఠశాలకు చెందిన బాల కథకులు ఆరుగురికి ఒక విద్యావేత్త 500 రూపాయల చొప్పున ప్రదానం చేశారు.

ఈ 59 కథలు అద్భుతమైనవి. నిజాయితీ, జంతువుల పట్ల దయ, మంచితనం. పల్లె జీవనం, స్నేహితులు, ప్రస్తుతం సమాజం లోని సంఘటన లను ప్రధాన ఇతివృత్తాలుగా చేసుకుని విద్యార్థులు చేయి తిరిగిన రచయితలకు ఏమాత్రం తీసిపోకుండా వ్రాసి విమర్శకుల మెప్పు పొందినారు. 88 పేజీలతో అందంగా ముద్రించబడిన ఈ పుస్తకం లోని కథలకు కె.బాబు మంచి బొమ్మలు వేశారు. ఇంత మంచి పుస్తకానికి వెల 50 రూపాయలు మాత్రమే! ప్రచురణ కర్తల ప్రయత్నం అభినందనీయం. మరిన్ని ప్రచురణ సంస్థలు, పత్రికలు ఇలా రాష్ట్ర వ్యాప్తంగా కథల పోటీలు నిర్వహించి ,బాలల లోని సృజనాత్మకత కు మెరుగులు దిద్దడానికి ముందడుగు వేయాలి.

ఇంటర్ నెట్ ,స్మార్ట్ ఫోన్ ల వాడకం పెరుగుతున్న ఈ రోజుల్లో పుస్తకాలకు ఆదరణ తగ్గిందనేది చాలా మంది అభిప్రాయం. కాని ఇటీవల మార్చి నెలాఖరున ఆవిష్కరించిన "జక్కాపూర్ బడి పిల్లల కథలు" పుస్తకానికి రెండు రాష్ట్రాలలో విశేష ఆదరణ లభించింది. పుస్తక ప్రతులు కొనుగోలు జరిగి నాలుగు నెలల లోపే వేయి ప్రతులతో రెండవ ముద్రణ కు సిద్ధమవుతున్నది. అమెరికాలో కూడా ఈ పుస్తకానికి మంచి గుర్తింపు లభించింది. ప్రవాస భారతీయులు బాల సాహిత్యాన్ని ప్రోత్సహించా లనే సంకల్పంతో బాలల రచనలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

పాఠశాల ఉపాధ్యాయులు, సాహిత్య సంస్థలు, బాల సాహితీవేత్తలు చిన్నారులలో సాహిత్య అభిలాష ను కల్పించి ,వారి చేత రచనా వ్యాసంగం చేపడితే రానున్న రోజుల్లో మంచి సమాజం సృష్టించబడుతుంది. సాహితీ మార్గంలో పయనించే వారు సన్మార్గంలో వెళ్లగలరు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భావి జీవితాన్ని బంగారుమయం చేసుకుంటారనేది నిజం. ప్రభుత్వం కూడా బాలలను సాహిత్యం వైపు ఆకర్షించడానికి తగిన చర్యలు చేపట్టాలి.



**- భైతి దుర్గయ్య**
సెల్ :9959007914

## జీవన తత్వం

అది ప్రాణహిత కాదు కానీ అక్కడో జీవధార ఉప్పొంగింది
అది గోదావరి లోయ కాదు, కానీ అక్కడ జీవననాద తరంగాల ప్రతిధ్వని
హృదయాంతరాల్లోకి పరివ్యాప్తమయ్యింది
అక్కడ కోట్లాది మందితో జనసభ నిర్వహించలేదు కానీ
తెలంగాణ ఏకాత్మ ఆవిష్కృతమైంది
అక్కడ ఏ యాగకార్యమూ నిర్వహించబడలేదు కానీ
సామాజిక జీవన తాత్త్వికత బోధపడింది
అక్కడ ఏ బందూకులూ వాటి మీద
శాంతికపోతాలూ ఎగరలేదు కానీ
బతుకుపోరు సాగించిన రణరంగం
విన్యాసాలు కండ్లల్ల కదలాడినయి
అక్కడు ఏ బుద్ధుడూ కనిపించలేదు కానీ,
ఎందరో సిద్దార్థుల తాత్విక పరిణామ క్రమం గతితార్కికమయ్యింది
అక్కడ వినిపించిన శబ్దాలు కనపించిన నిశబ్దాలు యేవీ కొత్తవి కాదు కానీ
పురా సమాధుల్లోంచి ఎగదన్నిన ఆర్తనాదాలను పట్టించినయి
అక్కడ యే పురాతన తవ్వకాలు సాగలేదుకానీ
ఏడుతరాల మాయిముంత మూత తెరుచుకోబడింది
అక్కడ ఎటువంటి వరల్డ్ సైన్స్ ఫోరం సెమినార్ జరగలేదు కానీ
తెలంగాణ సామాజిక తాత్త్విక ఆల్కెమీ రసాయనిక చర్య జరిగింది
అక్కడ ఎవరూ ఏమీ కనుగొనలేదు కానీ, పోగొట్టుకున్నవేవో కొత్తగా ఎదురొచ్చినవి
అక్కడా ఏ వజ్రాల లారీ బోల్తా పడలేదు కానీ
జీవితకాలానికి సరిపోయే ఆణిముత్యాల మాటల మూటలు దొరికినయి
అక్కడ ఏ వానా కురిసిన దాఖలాలు లేవు కానీ
సబ్బండ వర్ణాల సింగిడి విరిసింది
అక్కడ ఏ తీన్మార్ సప్పుల్లు లేవు కానీ
తెలంగాణ హృదయాత్మలు మయూరాలై నర్తించినయి
అక్కడ ఓడిపోయిన మనుసులు చేయి చేయి కలిపినయి
ఆత్మలు అలాయ్ బలాయ్ తీసుకున్నయి
అక్కడ వో జడలు సాగిన మర్రి మానుకింది
గెలుపు గర్వం సరదాగా కాసేపు సేదతీరింది
అక్కడ ధబ్బయేండ్ల తెలంగాణ తాత్వికత
సరికొత్తగా పుట్టిన రోజు జరుపుకున్నది

*(ఈనెల 19న రవీంద్రభారతిలో 70 వ పుట్టిన రోజు జరుపుకున్న సామాజిక తాత్వికుడు బిఎస్ రాములు సభ అందులో వక్తల మాటలు విన్న ప్రేక్షకుడి స్పందనగా....)*

**- హజారి రమేష్**

### నేటి కవిత


అష్టావధానాష్టకము

డా॥ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.

### నేటి నిజాలు

ఆకలి తీర్చి ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లులు
తనయులచే గెంటివేయబడ్డ అనాథలు
గుడి ముంగిట్లోనో
మందిరాల మెట్లమీదనో
మసీదుల మైదానంలోనో
మండుటెండల్లో దుఃఖిస్తున్న వస్తుల బతుకులు
సమాజంలోని పేదరికానికి సాక్ష్యాలు

నిరాదరణ నీడలో నలిగిపోయిన చీకటిబతుకులలో
వెలుగులు ప్రసరించేదెన్నడో ... ?

- కెరె జగదీష్



## ప్రేమతో నిండిన కవిత్వం కోట్లది

**మనుమసిద్ధి,అంతర్వాహిని- కవితాసంపుటాల ఆవిష్కరణ సభలో వక్తలు**

ప్రేమతో నిండిన కవిత్వం కోట్ల వెంకటేశ్వరరెడ్డిది అని వక్తలు కొనియాడారు. కాలంతో ఎదిగిన కవి అని ప్రశంసించారు. పాలమూరు సాహితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి కోట్ల



వెంకటేశ్వరరెడ్డి రచించిన ×మనుమసిద్ధి, అంతర్వాహిని× కవితా సంపుటాల ఆవిష్కరణ సభ ఆగస్టు 17 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో గల లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ లో నిర్వహించారు.

ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆర్తి తో ,ఆర్ద్రతతో నిండిన కవిత్వాన్ని కోట్ల నిరంతరం రాస్తున్నారన్నారు. భార్య మీద ప్రేమతో రాసిన అంతర్వాహిని కవితా సంపుటిలో తమ ప్రేమానుబంధాన్ని ఆత్మీయంగా తడిమారన్నారు.

కాలానికి నిలబడే చక్కని కవిత్వం రాస్తున్న కోట్ల కవిత్వం తాజాగా ఉంటుందన్నారు. సభాధ్యక్షులు జలజం సత్యనారాయణ మాట్లాడుతూ కోట్ల కాలంతో పాటు కవిత్వంలో రాణిస్తున్న కవి అని కొనియాడారు. ప్రముఖ విమర్శకులు గుడిపాటి మాట్లాడుతూ ముప్పై సంవత్సరాలుగా కవిత్వం రాస్తున్న కోట్లది ఎప్పుడూ ఆకట్టుకుంటుందన్నారు. ప్రతి వస్తువు మీద రాసిన కలం కోట్లదన్నారు. ప్రముఖ కవయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ తన చుట్టూ ఉన్న అన్ని అంశాలపై రాసిన కోట్ల తన ఇంటిదీపాలైన భార్య, మనవడి మీద రాయడం గొప్ప విశేషమన్నారు. అనంతరం మనుమసిద్ధి కవితా సంపుటిని డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, అంతర్వాహిని కవితా సంపుటిని డాక్టర్ భాస్కరయోగి పుస్తక సమీక్ష చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు వి.మనోహర్ రెడ్డి, బుర్రి వెంకట్రామారెడ్డి, డాక్టర్ గుంటి గోపి లు పాల్గొన్నారు.

## 'గాంధీ ది సోల్ ఫోర్స్ వారియర్' పుస్తకావిష్కరణ




ప్రముఖ గాంధేయ వాది, మాజీ భారత రాయబారి పాస్కల్ అలెన్ నజ రచించిన 'గాంధీ ది సోల్ ఫోర్స్ వారియర్' పుస్తకాన్ని సోమాజీగూడలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో ఆస్కీ ఛైర్మన్, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె. పద్మనాభయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ అహింస ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన గాంధీజీ ఆయుధాన్ని ప్రపంచ దేశాలకు అందించారన్నారు. కేవలం స్వాతంత్రోద్యమమే కాదు యాజమాన్య నిర్వహణ (మేనేజ్‌మెంట్)లోనూ ఆయన దిగ్గజమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ కోర్ట్ ఆఫ్ గవర్నర్స్ సభ్యులు రిచర్డ్ సల్దానా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ నిర్మల, ఆస్కీ ఎడిటర్, ప్రజా సంబంధాల మేనేజర్ డాక్టర్ ఎస్.రాము పాల్గొన్నారు.

## అభ్యుదయ కవి తిలక్

-వకుళాభరణం క్రిష్ణమోహన్



భావకవిత్వంలో అభ్యుదయం, అభ్యుదయంలో భావ కవిత్వాన్ని తన సాహిత్యంలో ఆవిష్కరించిన ప్రజాకవి బాలగంగాధర్ తిలక్ అని తెలంగాణ బీసీ కమీషన్ సభ్యుడు వకుళాభరణం క్రిష్ణమోహన్ అన్నారు. గానసభలో తిలక్ జయంతి సభ జరిగింది. కథ, కవిత్వంలో ప్రజలపక్షాన నిలిచిన కవి తిలక్ అని వకుళాభరణం పేర్కొన్నారు. కవి తంగిరాల చక్రవర్తి మాట్లాడుతూ చైనా ద్వంద్వ విధానంపై ఆనాడే తన కవిత్వంలో తిలక్ ధ్వజమెత్తారని తెలిపారు. కార్యక్రమంలో గాయని సంయుక్తతో పాటు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొన్నారు.

## క్వారీ తవ్వకాలపై కొరవడిన నిఘా?

ఆదిలాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): జిల్లాలో అనేక ప్రాంతాల్లో క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మంచిర్యాల పట్టణంలో భవన నిర్మాణాలు, నూతనంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరుగుతుండగా కట్టడం రాయికి చాలా డిమాండ్ ఉంది. దీంతో బండ క్వారీ కాంట్రాక్టర్లు వారికి కేటాయించిన సర్వే నెంబర్ స్థలాల్లో కాకుంటా వేరే చోట తవ్వకాలు జరిపి ప్రతినిత్యం వందలాది సఖ్యలో ట్రాక్టర్లలో బండరాయిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. యథేచ్ఛగా ట్రాక్టర్లలో బండ రాయిని అధికారుల కళ్ల ముందునుంచే రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గనులు భూగర్భ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌లకు క్వారీల ఏర్పాటు కోసం అనుమతి ఇచ్చే వ్యవహారంలో లోపభూయిష్టమైన విధానాల వల్ల కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడి ఒకే స్థలంలో క్వారీ నిర్వహిస్తున్నట్లు చూపిస్తూ మరోచోట నుంచి అదే అనుమతిపై అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని తూర్పు ప్రాంతంలో బండరాయి క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్‌లు చేస్తూ గుట్టలను పిండి చేస్తున్నారు. నిబంధనల ప్రకారం క్వారీ యజమానులు భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ అధికారుల నుంచి లీజు అనుమతి పొంది ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉండగా కొందరు కాంట్రాక్టర్లు రాయల్టీ చెల్లించడం లేదు. అధికారులు సైతం రాయల్టీ వసూలు చేయకుండా మామూళ్ల మత్తులో జోగు తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు స్టోన్స్ హద్దులు దాటి రిజర్వు ఫారెస్టు భూముల్లోనే తవ్వకాలు జరిపి బండ రాయిని వెలికి తీస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. లీజుకు ఇచ్చిన భూముల నుంచి బండ రాయిని తీస్తున్నారో లేక వేరే ప్రదేశాల నుంచి తీస్తున్నారో చూడాల్సిన అధికారులు ఈ విషయాన్ని మామూలుగా తీసుకుంటు-న్నారు. లక్షలాది రూపాయల ప్రభుత్వ రాయల్టీకి గండి కొడుతూ అక్రమంగా సాగిస్తున్న బండరాయి క్వారీలపై ఉన్నతాధికారులు దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మిషన్ భగీరథతో మంచినీటి సమస్యలు దూరం

### పూర్తి కావచ్చిన పైపుల పనులు

### గోదావరి జలాల తరలింపునకు చర్యలు: ఎమ్మెల్యే

జనగామ,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ అనే బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టి తాగునీటి సమస్యకు చెక్ పెట్టారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించింది. మిషన్ భగీరథ పథకం ద్వారా కరీంనగర్ జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి జనగామ జిల్లాకు గోదావరి జలాలు తీసుకువస్తున్నారు. జిల్లాలో సుమారు 1565 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మాణం చేశారు. జనగామ జిల్లా వ్యాప్తంగా ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాలను గుర్తించిన ప్రభుత్వం నల్లాల ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గడిచిన నాలుగేళ్లలో ఇప్పటికే అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేశారు. సర్కార్ ఆదేశాల మేరకు జిల్లాలోని 556 ఆవాసాలకు నీరివ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం దాన్ని అధిగమిస్తూ ప్రస్తుతం 564 ఆవాసాలకు నీటిని సరాఫరా చేస్తోంది. ఈ ఆవాసాల్లోని వారికి స్వచ్ఛమైన గోదావరి పంపిణీ చేస్తున్నారు. గత ఏడాది నుంచి జనగామ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయి. ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన గోదావరి నీరు సరాఫరా అవుతోందని ఎమ్మెల్యే అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని తీసుకుని సమీపంలోని నల్లారం గ్రామం వద్ద శుద్ధి చేసిన తర్వాత హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. కొండపాక నుంచి కొమురవెల్లి లింగం కమాన్ వద్ద నిర్మించిన 18 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంక్‌లోకి నీటిని పంపిణీ చేస్తున్నారు. అక్కడి నుంచి మద్దూర్ మండలం సలాక్‌పూర్ మీదుగా జనగామ మండలంలోని అడవికేశవపూర్‌లో నిర్మించిన 1.20 లక్షల కిలోలీటర్ల సామర్థ్యం గల ఓహెచ్‌బీఆర్ ట్యాంక్‌ను నింపుకుని జనగామ నియోజకవర్గానికి స్వచ్ఛమైన తాగునీటిని పంపిణీ చేస్తున్నారు. అడవికేశవపూర్‌లోని మరో ట్యాంక్ ద్వారా ఏసీరెడ్డినగర్, కళ్లెంలోని బ్రేక్ ప్రెషర్ ట్యాంకులు నింపుకుని పాలకుర్తి నియోజకవర్గానికి నీళ్లు పంపిణీ చేస్తున్నారు. నర్మెట మండలంలోని వెల్దండ సమీపంలోని ట్యాంకును నింపిన తర్వాత మేకలగట్టు తండా, ఖిలాషాపూర్, రఘునాథపల్లిలోని ట్యాంకుల ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి గోదావరి జలాలు పంపిణీ చేస్తున్నారు. ట్యాంకుల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన గోదావరి జలాలు పంపిణీ చేస్తున్నారు.

# అట్టడుగు వర్గాలకు దక్కనిసామాజిక న్యాయం

### శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

న్యూఢిల్లీ,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన వోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. ఇటీవల నీతి అయోగ్ విడుదల చేసిన రాష్ట్రాల ర్యాంకింగ్ నివేదిక ప్రకారం దళితులపై నేరాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఏడవ స్థానంలో, ఆరోగ్య ఇండెక్స్‌లో ఎనిమిదో స్థానంలో, మహిళలపై నేరాల్లో దేశంలో తొమ్మిదో స్థానంలోనూ వుండగా, ప్రాథమిక విద్యలో పదిహేడవ ర్యాంకులో వుంది. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం. అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పారు ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తోపాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి. అది ప్రత్యామ్నాయ రాజకీయ విధానాల ద్వారానే సాధ్యం.

## పొచ్చెర జలపాతంలో దూకి వృద్ధ దంపతుల ఆత్మహత్య

ఆదిలాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): బోథ్ మండలం పొచ్చెర జలపాతం వద్ద విషాదం నెలకొంది. పొచ్చెర జలపాతంలోకి దూకి దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. పరిస్థితిని సమీక్షించారు. భార్య మృతదేహం లభ్యం కాగా, భర్త మృతదేహం కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మృతులను నేరడిగొండకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.






శ్రీ శ్రీపాద శ్రీరామమూర్తి (శ్రీశ్రీశ్రీ)
మెమోరియల్ కల్చరల్ అసోసియేషన్
కాకినాడ
ఆహ్వానము
శ్రీపాద సూర్యప్రకాశరావు కవితా సంపుటి
తల్లి గోదావరి
ఆవిష్కరణ సభ
తేది : 25 ఆగష్టు 2019 ఆదివారం, సా॥ గం. 5.30 ని॥లకు
వేదిక : గాంధీ భవనం, వెంకటరత్నపురం, కాకినాడ.

| | |
|---|---|
| స్వాగతం : | శ్రీ పున్నంరాజు ఉమామహేశ్వరరావు, రచయిత, వ్యాఖ్యాత |
| అధ్యక్షులు : | శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ప్రముఖ కవి, ఆంధ్రీకుటీరం |
| ముఖ్య అతిథి, ఆవిష్కర్త : | కళారత్న డా॥ శిఖామణి, కవిసంధ్య సంపాదకులు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు |
| జ్యోతి ప్రజ్వలన : | శ్రీ ఫ్రాన్సిస్, ఉపసంచాలకులు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ |
| గౌరవ అతిథులు : | 'కళాప్రియ' శ్రీ పట్నాల రాము<br>కళైమామణి శ్రీ దాట్ల దేవదానంరాజు, ప్రముఖకవి, రచయిత<br>శ్రీ వి.ఎస్.ఆర్. సోమయాజులు, ప్రముఖ సాహితీవేత్త<br>శ్రీ మార్ని జానకిరామ చౌదరి, అధ్యక్షులు, సాహితీ స్రవంతి, కాకినాడ శాఖ |
| ఆత్మీయ అతిథులు : | డా॥ జోశ్యుల కృష్ణబాబు, ప్రముఖ సాహితీవేత్త<br>శ్రీమతి పుప్పాల సూర్యకుమారి, ప్రముఖ కవయిత్రి<br>డా॥ సుంకర గోపాల్, అధ్యక్షులు, తెలుగుశాఖ, పి.ఆర్. కాలేజి |
| కవి స్పందన : | శ్రీ శ్రీపాద సూర్యప్రకాశరావు |
| వందన సమర్పణ : | మేడిశెట్టి శ్రీరాములు, కవి, గాయకులు |

సాహితీ మిత్రులకు సాదర స్వాగతం


## ఖరీఫ్‌లో అధికంగా పప్పు ధాన్యాల సాగు

ఆదిలాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): ఖరీఫ్ ప్రణాళికను ఖరారుచేసిన మేరకు ముందుకు సాగినట్లు వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. గత ఖరీఫ్‌తో పోల్చుకుంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుందని భావిస్తున్నారు. గతేడాది కన్నా కొంచెం ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. జిల్లాలో ఈ సారి అపరాల సాగుఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కంది, మినుము, పెసర పంటలు, వేయాలని ప్రోత్సహించారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం విజ్ఞప్తి చేయడంతో ఆ మేరకు రైతులకు ఎక్కడా కొరత లేకుండా చేశారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు రోజుల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని పలు చోట్ల రైతులు విత్త నాలు, ఎరువుల కోసం రాస్తారోకోలు, ఆందోళనలు చేయగా, పలుమార్లు పోలీసులు లాఠీ చార్జీలు సైతం చేశారు .ఈ ఏడాది అలాంటి పరిస్థితి రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు ముందజాగ్రత్త చర్యలు చేపట్టారు. విత్తనాలు, ఎరువులు పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచారు.

## కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మరు: ఎమ్మెల్యే

వరంగల్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): పల్లెలు, పేదలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పేదోళ్లంతా పెద్దోళ్లు కావడమే సీఎం అభిమతమని చెప్పారు. మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే నూతన గ్రామపంచాయతీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పల్లె, తండా అభివృద్ధి కోసం అహర్నిషలూ శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. నూతన పంచాయతీలను రెండేళ్లలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేసినదానికంటే ఎక్కువ అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలోనే చేసి చూపించామని తెలిపారు. దసరా నాటికి ఇంటింటికీ శుద్ధజలం అందిస్తామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ వచ్చిందనీ, రైతుల పేరు చెప్పుకొని కాంగ్రెస్ నేతలు రాజకీయం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక నిర్ణయంతో మిషన్ కాకతీయతో జిల్లాలో చెరువుల మరమ్మతులకు నిధులు కేటాయించారన్నారు. ఇటీవల వర్షాలతో పలు మండలాల్లో పంట నీట మునిగిందనీ, పంటనష్టంపై వ్యవసాయాధికారులతో వివరాలు నమోదు చేయించాలని సూచించినట్లు తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అనీ, రైతు బీమా పథకం గొప్ప కార్యక్రమమని అన్నారు. రైతుబీమా అన్నదాతల కుటుంబాలకు భరోసా ఇస్తుందన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నందున గోదావరికి జలకళ వచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమనీ, అత్యాధునిక టెక్నాలజీతో శరవేగంగా పనులు జరుగుతున్నాయనీ, ప్రాజెక్టు పూర్తయితే కరువులేని రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతుల పేర్లు చెప్పి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## కొమురవెల్లిలో శ్రావణం సందడి

సిద్దిపేట,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు మల్లన్న ఆలయానికి భక్తులు తరలిరావడంతో మల్లన్న క్షేత్రంలో సందడి నెలకొంది. శ్రావణ మాసం ప్రారంభం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. స్వామివారి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు చేసిన మల్లన్న నామస్మరణలతో ఆలయం మార్మోగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి స్వామి వారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. వేకువజామున నిద్ర లేచి పుష్కరణిలో పవిత్ర స్నానం అచరించి మల్లన్నను దర్శించుకుంటున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, పట్నం, మరికొందరు తాము బస చేసిన గదుల వద్ద, మహామండపంలో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకోవడంతో పాటు కోరిన కోరికలు తీర్చాలని వేడుకున్నారు.




ఆహ్వానము
గుంటూరు జిల్లా రచయితల సంఘం (రి.నెం. 357/2007)
"తెలుగు భాషాదినోత్సవం"
(గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారి జయంతి సందర్భంగా)
తేది : 29-8-2019 గురువారం ఉ॥ 10-00 గం॥ లకు
వేదిక : యు.టి.ఎఫ్. హాలు, 2/6 బ్రాడీపేట, గుంటూరు.

సభా కార్యక్రమం

| | |
|---|---|
| అధ్యక్షులు : | శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, అధ్యక్షులు - ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం |
| ముఖ్య అతిథి : | శ్రీ కె.ఎస్. లక్ష్మణరావు, శాసనమండలి సభ్యులు |
| ఆత్మీయ అతిథి : | శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ కవి, అ.ర.సం. - జాతీయ కార్యదర్శి |

చిరు సత్కారం
(తెలుగు భాష కొరకు కృషి చేసిన ప్రముఖులకు)
ఆచార్య ఎస్. గంగప్ప విశ్రాంత ఆచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
శ్రీ రావెల సాంబశివరావు, విశ్రాంత రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
డా॥ రామడుగు వెంకటేశ్వర శర్మ, విశ్రాంత రీడర్
డా॥ వెన్నిశెట్టి సింగారావు, విశ్రాంత రీడర్
డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి విశ్రాత ప్రాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల
కవి సమ్మేళనం - అంశం : "తెలుగుభాష"
గుంటూరు జిల్లా రచయితల సంఘం
అందరూ ఆహ్వానితులే


## నిర్బంధ చర్యలకు దిగడం సరికాదు

### తెలంగాణలో సమస్యలపై గళం విప్పగలగాలి లేకుంటే మొదటికే మోసం రావచ్చు

హైదరాబాద్,ఆగస్ట్21 (ఆర్ ఎన్ఎ): ఇక సమస్య మీద సమావేశమై చర్చించుకోవాలన్నా, ఒక ఊరేగింపో, ధర్నానో చేసి ప్రభుత్వం దృష్టికి ఏదైనా అంశం తీసుకువెళ్లాలన్నా తెలంగాణలో సాధ్యం కావడం లేదు. నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాలపై పోరాటం సంగతి ఎలా ఉన్నా అక్కడికి వెళ్లి ప్రజలను కలవడానికి కూడా వీలులేనంతగా దాంక్షలు విధించారు. వెళ్తలానుకున్న వారు ఆ ఛాయలకు పోకుండానే అడ్డుకుని లోపల పడేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ఎంతమాత్రం వాంఛనీయం కాదు. ఇలాంటి తెలంగాన కోసం ప్రజలు కోరుకోలేదు. నిర్బంధాలకు కూడా ఓ హద్దు ఉండాలి. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని వివిధ ప్రజా, ఉద్యోగ, ఉద్యమ సంఘాల వారు వాపోతున్నారు. యురేనియం తవ్వకాల గురించి క్షేత్రపర్యటన చేయడానికి వెళ్లిన నాయకులను అరెస్టులు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు చూడడానికి వెళ్లిన ఉపాధ్యాయులను కూడా ఆ మధ్య అరెస్టు చేశారు. ఎందుకు ఇలా చేస్తున్నారో తెలియదు. ఇటువంటి చర్యల వల్ల సమాజంలో అసహనం పెరిగిపోవడమే తప్ప ప్రభుత్వం పట్ల సానుకూలత కనిపించదు. తన పాలనలో ఎటువంటి అశాంతి లేదని అంతా ప్రశాంతంగా ఉన్నదని కూడా కెసిఆర్ పదేపదే చెప్పుకున్నారు. ధర్నాచౌక్ కూడా ఉండకూడదని, బహిరంగ సభలన్నీ ఊరిబయట జరుపుకోవాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. సాధారణ ప్రజాజీవనంలో కూడా ఒక నిర్బంధ వాతావరణాన్ని టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఏ కారణం వల్ల ఈ విధానం తీసుకుని వచ్చారో తెలియదు కానీ, దాని పర్యవసానం మాత్రం ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తోంది. తెలంగాణలో సంస్కృతిని చాటడానికి, మతోన్మాదానికి అడ్డుకట్ట వేయడానికి చేస్తున్న ప్రయత్నం హర్షణీయం. తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారంతా తెలంగాణకో వ్యతిరేకులు అన్న భావజాలం ప్రచారం చేయడం సరికాదు. దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయి ఉద్యమం చేయడానికి పార్టీలు కలసి పోరాడే స్థితిలో లేవు. మోడీ అన్నిమంచిపనలుఉల చేశారని చెప్పడానికి లేదు. ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి ఎవరు కూడా సిద్ధం అవుతున్న దాఖలాలు కానరావడం లేదు. మరోవైపు ఆయా పార్టీల్లో ఉన్న అనైతకృతను క్యాష్ చేసుకోవాలని బిజెపి చూస్తోంది. ఈ దశలో రాజ్యాంగ బద్దంగా,ప్రాజస్వామ్యయుతంగా ఉన్నపార్టీలకు మాత్రమే ప్రజల నుంచి ఆదరన లభించగలదు.


యువభారతి (రి)
యువభారతి ఫౌండేషన్
శ్రీ త్యాగరాయ గానసభ సౌజన్యంతో
ప్రఖ్యాత సాహితీవేత్త, యువభారతి వ్యవస్థాపక అధ్యక్షులు
కీ॥శే॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారి జయంతి సభ
మరియు "మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి సాహిత్యం-వ్యక్తిత్వం"
సాహితీ సమాలోచన సమావేశం
తేది, సమయం : శనివారం, 24 ఆగష్టు 2019, సాయంత్రం 6 గంటలు
సభాస్థలి : కళా సుబ్బారావు కళావేదిక, త్యాగరాయగానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్.

| | |
|---|---|
| ముఖ్య అతిథి : | డా॥ కె.వి. రమణాచారి గారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు |
| సభాధ్యక్షులు : | ఆచార్య ఎస్.వి. రామారావు గారు, సుప్రసిద్ధ విమర్శకులు |
| విశిష్ట అతిథి : | శ్రీ కళా జనార్దన మూర్తి గారు, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ |
| గౌరవ అతిథి : | డా॥ తిరుమల శ్రీనివాసాచార్య గారు, తెలంగాణ ప్రభుత్వ "దాశరథి పురస్కార" గ్రహీత |

ప్రధాన వక్త మరియు ఇరివెంటి కృష్ణమూర్తి గారి స్మారక పురస్కార స్వీకర్త :
డా॥ నిడమర్తి నిర్మలాదేవి గారు
డా॥ తిరుమల శ్రీనివాసాచార్య, శ్రీమతి స్వరాజ్యలక్ష్మి ధర్మనిధి పురస్కార స్వీకర్త :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
సహృదయులందరూ ఆహ్వానితులే!
డా. ఆచార్య ఫణీంద్ర, అధ్యక్షులు
జీడిగుంట వెంకట్రావు, కార్యదర్శి
ఆచార్య వంగపల్లి విశ్వనాథం, సమావేశ కర్త
సమయ పాలన మన క్రమశిక్షణ

ఆహ్వానం
లేఖిని మహిళా చైతన్య సాహితీ సాంస్కృతిక సంస్థ
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త నిర్వహణలో
ప్రముఖ రచయిత్రి డా॥ పరిమళాసోమేశ్వర్ రచించిన




డా॥ పరిమళాసోమేశ్వర్

లేడీస్ స్పెషల్
'వార్త' దినపత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడిన నవల
ఆవిష్కరణ సభ
26 ఆగస్ట్ '2019 సోమవారం, సాయంత్రం 6: 00 గం॥లకు
కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో.
ముఖ్య అతిథి - పుస్తకావిష్కర్త
డా॥ కె.వి.రమణాచారి ఐ.ఏ.ఎస్. (రి)
ప్రభుత్వ సలహాదారు - తెలంగాణ ప్రభుత్వం
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్ధనమూర్తి
అధ్యక్షులు - 'శ్రీ త్యాగరాయ గానసభ'
సభాధ్యక్షులు : డా॥ వాసా ప్రభావతి
'కళారత్న హంస అవార్డు' గ్రహీత, 'లేఖిని' అధ్యక్షులు
అంకితం : డా॥ జి. సోమేశ్వరరావు 'రీడర్'- ప్రభుత్వ కళాశాల (రిటైర్డ్)
గౌరవ అతిథి : డా॥ ఓలేటి పార్వతీశం ప్రముఖ వక్త, విమర్శకులు
ఆత్మీయ అతిథులు
ఆచార్య సి. ఆనందారామం ప్రసిద్ధ రచయిత్రి
శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి ప్రముఖ రచయిత్రి
రచయిత్రి స్పందన : డా॥ పరిమళాసోమేశ్వర్
ప్రముఖ రచయిత్రి, ప్రిన్సిపాల్- ప్రభుత్వ కళాశాల (రిటైర్డ్)
ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.
శ్రీ సౌజన్యం జయంతి పబ్లికేషన్స్ గారి ప్రచురణ 92473 02882
కీ॥శే॥ యద్దనపూడి సులోచనారాణి, వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు
డా॥ వాసా ప్రభావతి, అధ్యక్షులు
గంటి భానుమతి, ప్రధాన కార్యదర్శి
అత్తలూరి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు
సండూరి సుందరి నాగమణి - మణి వడ్లమాని, కార్యదర్శులు
ఉంగుటూరి శ్రీలక్ష్మి - కుసుమ ఉప్పలపాటి, సంయుక్త కార్యదర్శులు


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.